'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 28 | శనివారం | 12.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 28 | Saturday | 12.9.2026 | Pages: 8 | Rate: 2

## రాజ్య సంస్కరణ

ప్రియమైన పాఠక మిత్రులకు..

ప్రజల గొంతుకగా, ప్రజా సమస్యల ప్రతిధ్వనిగా 'రాజ్య సంస్కరణ' తెలుగు దినపత్రికను ప్రారంభించి నేటికి నెల రోజులు పూర్తయ్యాయి. ఒక పత్రికను ప్రారంభించడం ఎంత సులభమో.. దానిని ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలబెట్టడం అంతే కష్టం. అయితే, మీ ఆదరాభిమానాలు, ఆశీస్సులు, ప్రోత్సాహంతో 'రాజ్య సంస్కరణ' తొలి అడుగుల్లోనే మంచి గుర్తింపును సొంతం చేసుకోవడం మాకు ఎంతో ఆనందాన్ని, అంతకుమించి బాధ్యతను కలిగిస్తోంది. ఈ నెల రోజుల్లో 'రాజ్య సంస్కరణ' కేవలం వార్తలను అందించే పత్రికగా కాకుండా.. ప్రజల సమస్యలను ప్రశ్నించే వేదికగా నిలిచేందుకు ప్రయత్నించింది. అధికారంలో ఉన్నవారిని పొగడటమో, విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకోవడమో కాదు.. ప్రజలకు ఏది అవసరమో, ప్రజల జీవితాలను ఏది ప్రభావితం చేస్తుందో అదే మా వార్తకు ప్రాధాన్యం. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, వాస్తవాలను నిర్భయంగా ప్రజల ముందుంచడం మా ప్రధాన బాధ్యత.

ఈ ప్రయాణంలో తొలి నెలలోనే మీ నుంచి లభించిన స్పందన మా అంచనాలకు మించి ఉంది. పాఠకుల నుంచి వస్తున్న సూచనలు, అభిప్రాయాలు, ప్రశంసలు మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. అదే సమయంలో మా లోపాలను ఎత్తిచూపుతూ మీరు అందిస్తున్న సూచనలు మరింత మెరుగ్గా పనిచేయడానికి దిశానిర్దేశం చేస్తున్నాయి.

'రాజ్య సంస్కరణ'కు పాఠకులే బలం.. ప్రజలే మార్గదర్శకులు.

ముందు రోజుల్లో ఈ పత్రికను మరింత విస్తరించాలి. మరిన్ని ప్రాంతాలకు చేరాలి. మరింత సమగ్ర సమాచారాన్ని అందించాలి. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే ప్రజల తరఫున గట్టిగా ప్రశ్నించాలి. ఈ లక్ష్యంతో 'రాజ్య సంస్కరణ' దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోంది. మొదటి నెలలోనే మాపై విశ్వాసం ఉంచిన ప్రతి పాఠకుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

మీ ఆదరణే మా అక్షరాలకు బలం..
మీ విశ్వాసమే మా ప్రయాణానికి దిక్సూచి..
ప్రజల పక్షాన.. ప్రజల కోసం.. ప్రజల గొంతుకగా..
'రాజ్య సంస్కరణ' నిరంతరం పనిచేస్తుందని హామీ ఇస్తున్నాం..

మీ ఆదరణ, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ..

మీ
- గుండెబోయిన వెంకన్న
చీఫ్ ఎడిటర్
రాజ్య సంస్కరణ తెలుగు దినపత్రిక



## మోదీ-పుతిన్ కార్ డిప్లమసీ

### మరోసారి కార్ ట్రావెల్ దౌత్యం

**నాలుగోసారి కలిసి సాగిన జంట**

**ఒకే కారులో ఇద్దరు నేతల చర్చలు**

దౌత్యం అంటే సాధారణంగా చర్చల టేబుల్ వద్ద జరిగే సంప్రదింపులు. కానీ భారత్-రష్యా సంబంధాల్లో ఇప్పుడు 'కార్ డిప్లమసీ' కూడా ప్రత్యేక చర్చగా మారుతోంది. న్యూఢిల్లీలో ద్వైపాక్షిక భేటీ ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే లిమోసిన్‌లో ప్రయాణించారు. బ్రిక్స్ సదస్సుకు ఒక రోజు ముందు జరిగిన ఈ ప్రయాణం ఇద్దరు నేతల మధ్య ఉన్న సాన్నిహిత్యానికి మరోసారి సంకేతంగా నిలిచింది.



## జీ7పై పుతిన్ 40 పర్సెంట్ పంచ్!

### బ్రిక్స్ బలం.. జీ7కు పుతిన్ షాక్

**ప్రపంచ ఆర్థిక శక్తిలో కొత్త సమీకరణం**

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జీ7పై నేరుగా విమర్శలు చేశారు. గత ఐదేళ్లలో ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా బ్రిక్స్ దేశాల వాటా ఉందని, అదే సమయంలో జీ7 వాటా కేవలం 29 శాతంగా ఉందని పుతిన్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారీ మార్పులు జరుగుతున్నాయని, ఒకప్పుడు ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన పాత శక్తుల స్థానంలో కొత్త వృద్ధి కేంద్రాలు ఎదుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక శక్తి పశ్చిమ దేశాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాల వైపు క్రమంగా మారుతున్నదనే సందేశాన్ని పుతిన్ ఈ గణాంకాల ద్వారా బలంగా వినిపించారు.



## ఓవైపు డాలర్.. మరోవైపు డిజిటల్

### కరెన్సీపై బ్రిక్స్‌లో భారత్ క్లారిటీ

**చెల్లింపులే అసలు లక్ష్యమని వెల్లడి**

2026 బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న వేళ డాలర్‌ను పూర్తిగా పక్కన పెట్టే విషయంలో భారత్ స్పష్టమైన వైఖరితో ఉంది. చైనా, రష్యా డీడాలరైజేషన్‌ను వ్యూహాత్మక లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తున్నాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా కూడా దీనిపై బలంగా మాట్లాడుతున్నారు. అయితే భారత్ మాత్రం డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఒకే బ్రిక్స్ కరెన్సీ తీసుకురావాలన్న ఆలోచనకు దూరంగా ఉంటోంది.



## 1 8వ బ్రిక్స్ సదస్సు

- ఢిల్లీలో ప్రపంచ నేతలు
- ప్రపంచం చూపు భారత్ వైపు
- నాలుగోసారి ఇండియాకు పగ్గాలు
- మోదీ నాయకత్వంలో కీలక చర్చలు

18వ బ్రిక్స్ సదస్సు రేపు. ఎల్లుండి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనుంది. 2026 జనవరి 1న భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించింది. ఇది భారత్‌కు నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్షత. గతంలో 2012, 2016, 2021లో భారత్ ఈ బాధ్యతలు చేపట్టింది. ఈసారి ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో సదస్సు జరుగుతుండటంతో ఢిల్లీ సమావేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు కీలక నేతలు హాజరవుతున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌కు రావడం కూడా ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

వివరాలు3లో..

## డూమ్స్‌డే ప్లేన్.. కదిలే క్రెమ్లిన్!

**రహస్య విమానంలో భారత్‌కు పుతిన్!**

**ఆకాశంలోనే అధ్యక్షుడి భద్రతా కోట**

**రెండు విమానాలు.. ఒకటే రహస్యం**

బ్రిక్స్ సదస్సు కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఆయన పర్యటనకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పుతిన్ ప్రయాణించే విమానాల విషయంలో రష్యా అనుసరించే ప్రత్యేక వ్యూహం మరోసారి ఆసక్తిని రేకెత్తించింది.



## మోదీ- షీ భేటీ

**సరిహద్దే అసలు పరీక్ష!**

**వాణిజ్య లోటుపై దృష్టి**

**ఏడేళ్ల తర్వాత ఢిల్లీకి షీ జిన్‌పింగ్**

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నేడు న్యూఢిల్లీలో కీలక ద్వైపాక్షిక భేటీ నిర్వహించనున్నారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో జరగనున్న ఈ సమావేశం ఇరు దేశాల సంబంధాల్లో కీలక ఘట్టంగా మారనుంది. షీ జిన్‌పింగ్ గతంలో 2016లో గోవాలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు, తర్వాత మహాబలిపురంలో జరిగిన అనధికారిక భేటీకి భారత్ వచ్చారు. అయితే 2014 తర్వాత ఢిల్లీకి ఆయన రావడం ఇదే తొలిసారి. 2020 తర్వాత ఇరు దేశాల నేతల మధ్య ద్వైపాక్షిక పర్యటనలు కూడా జరగలేదు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాల్లో ఇటీవల కొంత కదలిక కనిపిస్తున్నా, దీనిని ఇప్పుడే పూర్తిస్థాయి 'రీసెట్'గా చెప్పలేమని నిపుణులు భావిస్తున్నారు.



## ఢిల్లీ హోటళ్లు

**ప్రపంచ నేతల కోటలు!**

**బ్రిక్స్‌తో మారిన ఢిల్లీ హోటల్ సీన్**

**పుతిన్ నుంచి షీ వరకు హైసెక్యూరిటీ**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో న్యూఢిల్లీలోని లగ్జరీ హోటళ్లు హైసెక్యూరిటీ దౌత్య కేంద్రాలుగా మారిపోయాయి. ఇవాళ, రేపు జరిగే సదస్సు కోసం ఢిల్లీ వ్యాప్తంగా 3,000కు పైగా హోటల్ గదులు బుక్ అయినట్లు సమాచారం. ప్రముఖ హోటళ్లలో సాధారణ అతిథులకు గదులు దొరకని పరిస్థితి నెలకొంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఐటీసీ మౌర్యలో బస చేస్తున్నారు. అక్కడ గది అద్దెలు కొన్ని సందర్భాల్లో రాత్రికి రూ.2 లక్షలు దాటుతున్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తాజ్ ప్యాలెస్‌లో బస చేయనున్నారు. ఈ హోటల్‌లో ప్రస్తుతం గదులన్నీ బుక్ అయినట్లు సమాచారం. ది ఒబెరాయ్ న్యూఢిల్లీలో బ్రెజిల్, కజకిస్థాన్, ఇథియోపియా, ఇండోనేషియా ప్రతినిధి బృందాలు బస చేస్తున్నాయి.



## నాకు తక్కువేంటి?

### కమిషన్లు నాకెందుకు?

- దేవుడు అన్నీ ఇచ్చాడు!
- విద్యే తెలంగాణ భవిష్యత్
- తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు
- జెన్ ఆల్ఫా.. జెన్ బీటాపైనే ఫోకస్
- విద్యపై అసెంబ్లీలో సీఎం రేవంత్



తెలంగాణ విద్యా విధానంపై శాసనసభలో చర్చ జరగడం శుభ పరిణామమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సభ్యులు ఇచ్చే సూచనలు, సలహాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని తాను బలంగా నమ్ముతున్నట్లు చెప్పారు. అందరూ జెన్ జీ గురించి ఆలోచిస్తుంటే.. తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల గురించి ఆలోచిస్తున్నానని రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ విద్యా విధానాలను తెలంగాణకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలోని అనేక ప్రముఖ విద్యా సంస్థలకు నెహ్రూ వేసిన పునాదులే ఆధారమని చెప్పారు. తెలంగాణలోని ప్రస్తుత విశ్వవిద్యాలయాల్లో చాలా వరకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. విద్య ఒక్కటే జీవితాల్లో వెలుగులు నింపగలదన్నది తన సంపూర్ణ విశ్వాసమని సీఎం స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)



## ఒక్క పెన్నుపోటుతో భూములు కబ్జా

**22ఏ భూ దోపిడీపై హరీశ్‌రావు ఫైర్**

22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో భూ సమస్యపై పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పెన్నుపోటుతో రాత్రికి రాత్రే ప్రజల భూములను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. (వివరాలు 2లో..)



## తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు!

**అనకొండలంటూ కేటీఆర్ ఫైర్**

"తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు" అన్నట్టుగా రేవంత్ అన్నదమ్ములు 22ఏ పేరుతో భూ దోపిడీకి తెగబడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని "అనుముల అనకొండలు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. (వివరాలు 2లో..)

## బీసీల లెక్క తేలాలి.. హక్కులు దక్కాలి!

**అసెంబ్లీలో మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్**

బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేర్చాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు.



## వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం!

**అసెంబ్లీ సాక్షిగా రైతులకు భట్టి హామీ**

వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనమండలిలో స్పష్టం చేశారు. భూమ్యాకాశాలు ఏకమైనా, ఎలాంటి ఒత్తిడి వచ్చినా వ్యవసాయ మోటార్లకు (2లో..)



## పాలిటెక్నిక్‌పై దుష్ప్రచారమా

**ప్రైవేటీకరణ మాటే లేదు**

**మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పాలిటెక్నిక్‌లను యంగ్ ఇండియా యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వెనుక ఉద్దేశం సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేయడమేనని చెప్పారు. (2లో..)



## బ్యాంకులు బంద్.. దేశవ్యాప్త సమ్మె



**వారానికి ఐదు రోజుల పనికి డిమాండ్**

ఐదు రోజుల పనివారాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెకు దిగడంతో శుక్రవారం బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపుతో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొన్నారు. (వివరాలు 2లో..)

## ఖైరతాబాద్ గణేశ్.. ట్రాఫిక్ డైవర్షన్స్!




**సెప్టెంబర్ 12 నుంచి ఆంక్షలు అమలు**

ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ప్రకటించారు. సెప్టెంబర్ 12 నుంచి 24 వరకు అవసరాన్ని బట్టి డైవర్షన్స్ అమల్లో ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పరిస్థితిని బట్టి ఆంక్షలు కొనసాగుతాయి. (వివరాలు 2లో..)

# బీసీల లెక్క తేలాలి.. హక్కులు దక్కాలి!

## అసెంబ్లీలో మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్



అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితంగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. కాకా కాలేల్కర్ కమిషన్, మండల్ కమిషన్ నుంచి ఇంద్రా సాహ్నీ తీర్పు వరకు బీసీ రిజర్వేషన్ల ప్రయాణాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు? ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? అనే వివరాలు డేటా ఆధారంగా తెలుసుకున్నామని తెలిపారు. "జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. బీసీల జనాభా తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు. "బీసీలను లెక్కించాలి.. బీసీలకు న్యాయం చేయాలి" అని శ్రీహరి స్పష్టం చేశారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం!

## అసెంబ్లీ సాక్షిగా రైతులకు భట్టి హామీ



వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనమండలిలో స్పష్టం చేశారు. భూమ్యాకాశాలు ఏకమైనా, ఎలాంటి ఒత్తిడి వచ్చినా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని, రైతులకు 100 శాతం హామీ ఇస్తున్నామని తేల్చిచెప్పారు. రైతుల్లో అనవసర భయాలు, అపోహలు సృష్టించవద్దని కోరారు. వ్యవసాయ మీటర్లకు సంబంధించి ఆర్డీఎస్ఎస్‌లో ఎలాంటి తప్పనిసరి నిబంధన లేదని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కేంద్రంతో ఉదయ్ త్రైపాక్షిక ఒప్పందం చేసుకుందని, ఆ ఒప్పందంలో పేర్కొన్న అంశాలకు మించి ప్రస్తుత ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయదని చెప్పారు. ఆర్డీఎస్ఎస్ కింద జరుగుతున్న పనులు మీటర్ల కోసం కాదని, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ఆధునీకరణ, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ నెట్‌వర్క్ అప్‌గ్రేడ్ కోసం చేపడుతున్నామని తెలిపారు. కేంద్రం 60 శాతం గ్రాంట్ ఇస్తుండగా, మిగిలిన 40 శాతం రాష్ట్రం భరిస్తోందన్నారు. సెప్టెంబర్ 9న తెలంగాణలో రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని, 2029-30 నాటికి 24,624 మెగావాట్లకు, 2034-35 నాటికి 34,137 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని చెప్పారు.

**సోలార్‌తో పగలు.. స్టోరేజ్‌తో రాత్రి**

రైతులపై విద్యుత్ భారం వేయకుండా సోలార్ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా రూ.14 వేల కోట్లు ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. రైతుల అంగీకారంతో పంప్‌సెట్లను ప్రభుత్వ ఖర్చుతో సోలరైజ్ చేస్తున్నామని, ప్రస్తుతం ఇది పైలట్ ప్రాజెక్టుగా కొనసాగుతోందన్నారు. రైతులకు ఇష్టం లేకపోతే ప్రస్తుత ఉచిత విద్యుత్ సదుపాయం కొనసాగుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ద్వారా పగటిపూట ఉత్పత్తయ్యే సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసి రాత్రిపూట కూడా రైతులకు సరఫరా చేసే ప్రణాళిక ఉందన్నారు. తక్కువ ధరకు విద్యుత్ అందించడంతో పాటు గ్రీన్ ఎనర్జీని పెంచడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడానికి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరగడం కారణమని వివరించారు. గతంలో 9,000-10,000 మెగావాట్లుగా ఉన్న డిమాండ్ ఇప్పుడు 19,000-20,000 మెగావాట్లకు చేరిందన్నారు. కొత్త విద్యుత్ ప్రాజెక్టులు వెంటనే నిర్మించడం సాధ్యం కాకపోయినా, ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు, ప్రజలకు నిరంతర సరఫరా అందిస్తామని భట్టి స్పష్టం చేశారు.

# పాలిటెక్నిక్‌పై దుష్ప్రచారమా

- మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ



ఐటీఐలను టాటా సహకారంతో అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సెంటర్లుగా మార్చినంత మాత్రాన వాటిని ప్రైవేటుపరం చేసినట్టేనా అని ప్రశ్నించారు. ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనంగా 282 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏటీసీలకు కేటాయించామని, ఒక్కో కేంద్రంపై రూ.46 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆధునిక ల్యాబ్‌లు, పరికరాలు, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించడమే లక్ష్యమన్నారు. AI, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలకు అనుగుణంగా కోర్సులను ఆధునీకరిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో అపోహలు తొలగిస్తామని, అవసరమైతే జీవోలో మార్పులు చేస్తామని, AICTE అనుమతులు కూడా తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ రాజకీయ దుష్ప్రచారం చేస్తోందని శ్రీధర్‌బాబు మండిపడ్డారు.

**ఫీజు బకాయిలపై బీఆర్ఎస్ టార్గెట్**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కాంగ్రెస్ పేటెంట్ అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని వీడే నాటికి రూ.5,430 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిందని, అందులో రూ.1,410 కోట్లు తాము చెల్లించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 32 నెలల్లో మొత్తం రూ.3,488 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించామని వెల్లడించారు. విజిలెన్స్ విచారణ పేరుతో గత ప్రభుత్వం కాలేజీలను రాజకీయంగా ఒత్తిడి చేసిందని ఆరోపించారు. నచ్చిన కాలేజీలకు ఫీజులు పెంచి, నచ్చని కాలేజీలను పక్కన పెట్టిందని విమర్శించారు. జెన్యూన్ కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని, కేంద్ర నిధులు పొందాలంటే కేంద్ర నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ పథకం విద్యార్థుల కోసం తప్ప కాలేజీ యాజమాన్యాల కోసం కాదని తేల్చిచెప్పారు. విద్యార్థులు రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దని సూచించారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం మాత్రం పోలేదంటూ శ్రీధర్‌బాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# హైవేపై హాలిడే ట్రాఫిక్ హోరు

**గంటల తరబడిన నిలిచిన వాహనాలు**



హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ ట్రాఫిక్ జామ్.. మూడు రోజుల వరుస సెలవులతో నగరం ఒక్కసారిగా ఖాళీ అవుతోంది. శనివారం రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయక చవితి సెలవులు వరుసగా రావడంతో వేలాది మంది నగరవాసులు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా హయత్‌నగర్ పరిసరాల్లో పరిస్థితి తీవ్రంగా మారింది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో బంపర్ టు బంపర్ ట్రాఫిక్ ఏర్పడింది. వాహనాలు నత్తనడకన కదలడంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్డుపైనే చిక్కుకుపోయారు. నగర శివార్లలోని కీలక ఎగ్జిట్ పాయింట్ల వద్ద రద్దీ మరింత పెరగడంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. భారీగా సిబ్బందిని మోహరించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. టోల్ ప్లాజాల వద్ద రద్దీని నియంత్రిస్తూ, ట్రాఫిక్ బాటిల్‌నెక్స్‌ను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే హైవేపై వాహనాల ప్రవాహం పెరగడంతో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా హయత్‌నగర్ దాటే వాహనదారులు అదనపు సమయం కేటాయించుకోవాలని కోరుతున్నారు. వరుస సెలవులతో సొంతూర్లకు బయలుదేరిన ప్రజల ప్రయాణం ప్రస్తుతం ట్రాఫిక్ పరీక్షగా మారింది. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి, రద్దీ సమయాల్లో ప్రయాణాన్ని సాధ్యమైనంత వరకు నివారించాలని అధికారులు కోరారు.

# నాకు తక్కువేంటి?

## కమిషన్లు నాకెందుకు?

- దేవుడు అన్నీ ఇచ్చాడు!
- విద్యే తెలంగాణ భవిష్యత్
- తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు
- జెన్ ఆల్ఫా.. జెన్ బీటాపైనే ఫోకస్
- విద్యపై అసెంబ్లీలో సీఎం రేవంత్



తెలంగాణ విద్యా విధానంపై శాసనసభలో చర్చ జరగడం శుభ పరిణామమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సభ్యులు ఇచ్చే సూచనలు, సలహాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని తాను బలంగా నమ్ముతున్నట్లు చెప్పారు. అందరూ జెన్ జీ గురించి ఆలోచిస్తుంటే.. తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల గురించి ఆలోచిస్తున్నానని రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ విద్యా విధానాలను తెలంగాణకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలోని అనేక ప్రముఖ విద్యా సంస్థలకు నెహ్రూ వేసిన పునాదులే ఆధారమని చెప్పారు. తెలంగాణలోని ప్రస్తుత విశ్వవిద్యాలయాల్లో చాలా వరకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. విద్య ఒక్కటే జీవితాల్లో వెలుగులు నింపగలదన్నది తన సంపూర్ణ విశ్వాసమని సీఎం స్పష్టం చేశారు.

**విద్యా బడ్జెట్ భారీగా పెంపు**

తెలంగాణలో విద్యకు కేటాయింపులు గణనీయంగా పెంచామని సీఎం వివరించారు. 202324లో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖకు సుమారు రూ.19 వేల కోట్ల బడ్జెట్ కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం 202425లో రూ.21,292 కోట్లు, 202526లో రూ.23,108 కోట్లు, 202627లో రూ.26,647 కోట్లు కేటాయించిందని తెలిపారు. అంటే కేవలం మూడేళ్లలో విద్యాశాఖ బడ్జెట్‌ను రూ.7,554 కోట్ల మేర పెంచినట్లు చెప్పారు. విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయింపుల దిశగా ముందుకు వెళ్లడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాను ముఖ్యమంత్రిగా విద్యాశాఖను స్వయంగా నిర్వహించడం ఆ శాఖకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని చెప్పారు. విద్యాశాఖపై తనకు ప్రత్యేకమైన ప్యాషన్ ఉందని రేవంత్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను సమీక్షిస్తే మొత్తం విద్యా వ్యవస్థ సమీక్షలోకి వస్తుందని వివరించారు. రాష్ట్రంలో సామాజిక వెనుకబాటుకు ప్రధాన కారణం ఆస్తులు, అంతస్తులు కాకుండా విద్యకు దూరంగా ఉండటమేనని ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలిందని తెలిపారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యా విధానంలో మార్పులు అవసరమని, అందుకోసం కొత్త విద్యా విధానాన్ని రూపొందించేందుకు విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని చెప్పారు. కమిషన్ నివేదికను పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశామని, సభ్యుల సూచనలు ఆ కమిటీకి అందించాలని కోరారు.

**రికార్డు స్థాయిలో టీచర్ల నియామకాలు**

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 రోజుల్లో 10,006 మంది ఉపాధ్యాయుల నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పారు. ఎలాంటి చిన్న ఆరోపణకు కూడా తావులేకుండా నియామకాలు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందని వివరించారు. తాను విద్యాశాఖ బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మేర పెరిగిందని చెప్పారు. ఇది విద్యాశాఖ మంత్రిగా తన పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలు, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తెలంగాణలో అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**పాలిటెక్నిక్‌లపై క్లారిటీ.. ప్రైవేటీకరణ లేదు**

పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారం వంద శాతం అవాస్తవమని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలలు ఇప్పటివరకు ఎలా ఉన్నాయో అదే విధంగా కొనసాగుతాయని తెలిపారు. మూడేళ్ల డిప్లొమా కోర్సు, అకడమిక్ హోదా యథాతథంగా ఉంటాయని స్పష్టం చేశారు. అవసరమైతే జీవో ఎంఎస్ నెం.97లో సవరణలు చేస్తామని చెప్పారు. ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరానికి లేటరల్ ఎంట్రీ అవకాశాలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. స్కిల్ యూనివర్సిటీలకు ఏఐసీటీఈ అనుమతులు తీసుకొస్తున్నామని చెప్పారు. ఏటీసీల భూములు తీసుకోలేదని, అదనంగా 282 ఎకరాలు కేటాయించామని వెల్లడించారు. విద్యార్థులకు మరిన్ని నైపుణ్య అవకాశాలు కల్పించేందుకే స్కిల్ యూనివర్సిటీలను తీసుకొచ్చామని వివరించారు. విద్యాశాఖపై తనపై వచ్చిన ఆరోపణలపైనా సీఎం స్పందించారు. కమీషన్లు తీసుకోవాల్సిన అవసరం తనకు లేదని, గత 17 ఏళ్లలో జడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు, సీఎం వంటి పదవులు వరుసగా వచ్చాయని చెప్పారు. తనకు డబ్బు సంపాదించడమే లక్ష్యం కాదని, ప్రశాంతంగా జీవించడమే ముఖ్యమని పేర్కొన్నారు. మొత్తంగా విద్యను తెలంగాణ భవిష్యత్తుకు ప్రధాన పునాదిగా మార్చడమే తన లక్ష్యమని రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు.



# ఒక్క పెన్నుపోటుతో భూములు కబ్జా

## 22ఏ భూ దోపిడీపై హరీశ్‌రావు ఫైర్

22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో భూ సమస్యపై పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పెన్నుపోటుతో రాత్రికి రాత్రే ప్రజల భూములను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. ఒక్క సెంట్ భూమిని కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రశ్నించిన హరీశ్‌రావు, రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు 33 జిల్లాల కలెక్టర్లు భూములను 22ఏ జాబితాలో చేర్చుతున్నట్లు లేఖలు రాసిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటికి చీము, నెత్తురు ఉంటే తక్షణమే రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. కేసీఆర్ పాలన ప్రజలను కేంద్రంగా సాగితే, రేవంత్ పాలన భూముల కేంద్రంగా కొనసాగుతోందని విమర్శించారు.

**రైతుల భూముల కోసం పోరాటం**

22ఏ నిషేధిత జాబితా రైతులకు విలయం, విధ్వంసంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. కౌటాలకు చెందిన మహిళా రైతు ఎదుర్కొంటున్న సమస్యను ప్రస్తావిస్తూ, కేసీఆర్ హయాంలో పట్టా పాస్‌బుక్ వచ్చిన భూమికి కొత్త రుణం కోసం వెళ్లగా, భూమి 22ఏలో ఉందంటూ రుణం నిరాకరించారని తెలిపారు. మూడు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి పాత రుణం చెల్లించినా, కొత్త రుణం రాకపోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ తమకు తెలియదని అనుకునే వారికి తాము చేసిన పోరాటాలు తెలుసని వ్యాఖ్యానించారు. 22ఏ జాబితాలో చేర్చిన భూములను తిరిగి విడిపించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతుల కన్నీళ్లు రాష్ట్రానికి మంచిది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని రేవంత్‌రెడ్డిని కోరారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల భూములను వివాదాల్లోకి నెట్టడం సరికాదని హరీశ్‌రావు విమర్శించారు.

# తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు!

## అనకొండలంటూ కేటీఆర్ ఫైర్



"తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు" అన్నట్టుగా రేవంత్ అన్నదమ్ములు 22ఏ పేరుతో భూ దోపిడీకి తెగబడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని "అనుముల అనకొండలు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల బాధితులతో మాట్లాడిన కేటీఆర్, ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 16 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య కోటి 16 లక్షల ఎకరాలకు చేరిందని ఆరోపించారు. ప్రజల భూములను 22ఏ జాబితాలో చేర్చి హక్కులను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నవారు ప్రజల భూములను కాపాడాల్సింది పోయి వాటిపైనే కన్నేశారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను శాసనసభ నుంచి బయటకు పంపించారని ఆరోపించారు.

**భూముల కోసం పోరాటం ఆగదు**

తమపై ఎన్ని కుట్రలు పన్నినా 22ఏ బాధితుల తరఫున పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారిక రెవెన్యూ వ్యవస్థకు సమాంతరంగా మరో వ్యవస్థ పనిచేస్తోందని, భూముల వ్యవహారంలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్ భూములపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమిని అమ్మేందుకు అంగీకరించని వారిని నిషేధిత జాబితా పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బాధితుల వాదనలు విన్నామని, వారి సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. భూమి హక్కుల కోసం అవసరమైతే ప్రజా ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. "గజానికి ఒక గజ దొంగ ఉన్న ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం" అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 22ఏ వ్యవహారంపై పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకొచ్చి బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# ఖైరతాబాద్ గణేశ్.. ట్రాఫిక్ డైవర్షన్స్!

## సెప్టెంబర్ 12 నుంచి ఆంక్షలు అమలు



ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ప్రకటించారు. సెప్టెంబర్ 12 నుంచి 24 వరకు అవసరాన్ని బట్టి డైవర్షన్స్ అమల్లో ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పరిస్థితిని బట్టి ఆంక్షలు కొనసాగుతాయి. భక్తుల రద్దీ పెరిగితే పోలీసులు ట్రాఫిక్ నియంత్రణను మరింత కఠినతరం చేయనున్నారు. వీవీ విగ్రహం నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే వాహనాలను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు. ఓల్డ్ పోలీస్ స్టేషన్ సైఫాబాద్ నుంచి రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వచ్చే వాహనాలను రాజ్‌దూత్ లేన్ వద్ద ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి మింట్ కాంపౌండ్ మీదుగా ఐమ్యాక్స్ థియేటర్ వైపు వెళ్లే వాహనాలకు అనుమతి ఉండదు. వాటిని మింట్ కాంపౌండ్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్ వైపు మళ్లించనున్నారు.

**రద్దీకి అనుగుణంగా మార్పులు**

నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వచ్చే వాహనాలను సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ పోస్టాఫీస్ లేన్ మీదుగా ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పోస్టాఫీస్ వద్ద ఓల్డ్ పోలీస్ స్టేషన్ సైఫాబాద్ జంక్షన్ వైపు మళ్లించనున్నారు. గణేశ్ ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారు. భక్తుల రాకపోకల సంఖ్యను బట్టి డైవర్షన్స్‌లో మార్పులు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున అత్యవసరం కాకపోతే ఆయా మార్గాల్లో ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ రూట్లు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. వాహనదారులు ముందుగానే తమ ప్రయాణ మార్గాన్ని ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని కోరారు. పండుగ రోజుల్లో దర్శనానికి వచ్చే భక్తులు కూడా పోలీసుల సూచనలు పాటిస్తూ రద్దీని నియంత్రించేందుకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# బ్యాంకులు బంద్.. దేశవ్యాప్త సమ్మె

## వారానికి ఐదు రోజుల పనికి డిమాండ్




దీంతో దేశవ్యాప్తంగా చాలా ప్రభుత్వ బ్యాంకుల శాఖలు పూర్తిగా లేదా పాక్షికంగా మూతపడ్డాయి. నగదు జమ, నగదు ఉపసంహరణ, చెక్ క్లియరెన్స్, శాఖల పరిపాలనా పనులు ప్రభావితమయ్యాయి. ప్రైవేట్ బ్యాంకుల కార్యకలాపాలపై సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. అయితే UPI, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు సాధారణంగానే కొనసాగాయి. ప్రస్తుతం నెలలో మొదటి, మూడో, ఐదో శనివారాల్లో బ్యాంకులు పనిచేస్తున్నాయి. 2024 మార్చిలో జరిగిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలన్న అంశం అంగీకారానికి వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నామని యూనియన్లు చెబుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి.

ఐదు రోజుల పనివారంతో పాటు పెన్షన్ నవీకరణ, మెరుగుదల, అన్ని పెన్షనర్లకు ఒకే విధమైన డియర్‌నెస్ అలవెన్స్ విధానం అమలు చేయాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)కు మారే అవకాశం కల్పించాలని కోరుతున్నాయి. సమ్మె ప్రభావం పలు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపించింది. మధ్యప్రదేశ్‌లోనే సుమారు 7,000 బ్యాంకు శాఖల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని 8,707 శాఖల్లో దాదాపు 7,000 శాఖలకు చెందిన 42 వేల మంది ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొన్నట్లు ఉద్యోగ సంఘాలు తెలిపాయి. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకుల సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లో ఒక్కరోజులో దాదాపు రూ.5,500 కోట్ల విలువైన బ్యాంకింగ్ కార్యకలాపాలు ప్రభావితమైనట్లు సంఘాలు వెల్లడించాయి. సమ్మె నేపథ్యంలో పలు ప్రభుత్వ బ్యాంకులు ముందుగానే ఖాతాదారులను అప్రమత్తం చేశాయి. శాఖల్లో సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున అత్యవసర లావాదేవీలకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించాయి.

# 18వ బ్రిక్స్ సదస్సు

**ఢిల్లీలో ప్రపంచ నేతలు**
**ప్రపంచం చూపు భారత్ వైపు**
**నాలుగోసారి ఇండియాకు పగ్గాలు**
**మోదీ నాయకత్వంలో కీలక చర్చలు**

18వ బ్రిక్స్ సదస్సు రేపు. ఎల్లుండి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనుంది. 2026 జనవరి 1న భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించింది. ఇది భారత్‌కు నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్షత. గతంలో 2012, 2016, 2021లో భారత్ ఈ బాధ్యతలు చేపట్టింది. ఈసారి ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో సదస్సు జరుగుతుండటంతో ఢిల్లీ సమావేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు కీలక నేతలు హాజరవుతున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌కు రావడం కూడా ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

### 11 దేశాల నుంచి భారీ ప్రతినిధిత్వం

2024లో ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఇథియోపియా చేరడంతో బ్రిక్స్ సభ్య దేశాల సంఖ్య 11కి చేరింది. 2025లో ఇండోనేషియా కూడా చేరింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్ సిసీ, ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్ జొమార్ట్ టోకయేవ్ పాల్గొననున్నారు. యూఏఈ తరఫున అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహ్మద్ బిన్ జాయెద్ హాజరవుతారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ వంటి నేతలు కూడా ఢిల్లీకి రానున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ కూడా సదస్సులో పాల్గొంటారు.

### వాణిజ్యం నుంచి ఏఐ వరకు కీలక అజెండా

ఈసారి బ్రిక్స్ చర్చల్లో సరఫరా వ్యవస్థలు, వాణిజ్యం, సరిహద్దు చెల్లింపులు, జాతీయ కరెన్సీల వినియోగం, కృత్రిమ మేధస్సు, సాంకేతికత, ఇంధనం, అభివృద్ధి ఆర్థిక సహకారం ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. వ్యవసాయం, ఆరోగ్యం, ఆవిష్కరణలు, స్వచ్ఛ ఇంధనం, సుస్థిర అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టనున్నారు. భారత్ ప్రతిపాదిస్తున్న సరిహద్దు చెల్లింపుల వ్యవస్థ కీలక చర్చగా మారే అవకాశం ఉంది. "స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో భారత్ అధ్యక్షత వహిస్తున్న ఈ సదస్సు మానవ కేంద్రిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనుంది. అదే సమయంలో ఉక్రెయిన్, ఇరాన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాల నేపథ్యంలో రష్యా, చైనా, పాశ్చాత్య దేశాలతో సంబంధాలను సమతుల్యం చేస్తూ భారత్ దౌత్యపరంగా వ్యవహరించాల్సిన కీలక పరీక్షగా ఈ సదస్సు మారింది. క్వాడ్, జీ20లోనూ కీలక భాగస్వామిగా ఉన్న భారత్ బ్రిక్స్ వేదికపై తీసుకునే నిర్ణయాలపై అమెరికా సహా ప్రపంచ దేశాల దృష్టి నిలిచింది.

## మోదీ–పుతిన్ కార్ డిప్లమసీ

- మరోసారి కార్ ట్రావెల్ దౌత్యం
- నాలుగోసారి కలిసి సాగిన జంట
- ఒకే కారులో ఇద్దరు నేతల చర్చలు




దౌత్యం అంటే సాధారణంగా చర్చల టేబుల్ వద్ద జరిగే సంప్రదింపులు. కానీ భారత్-రష్యా సంబంధాల్లో ఇప్పుడు 'కార్ డిప్లమసీ' కూడా ప్రత్యేక చర్చగా మారుతోంది. న్యూఢిల్లీలో ద్వైపాక్షిక భేటీ ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే లిమోసిన్‌లో ప్రయాణించారు. బ్రిక్స్ సదస్సుకు ఒక రోజు ముందు జరిగిన ఈ ప్రయాణం ఇద్దరు నేతల మధ్య ఉన్న సాన్నిహిత్యానికి మరోసారి సంకేతంగా నిలిచింది. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా గత ఏడాది చైనాలో తొలిసారి ఇద్దరూ కలిసి కారులో ప్రయాణించారు. ఆ తర్వాత మరో రెండు సందర్భాల్లోనూ ఒకే కారులో కనిపించారు. శుక్రవారం జరిగిన ప్రయాణంతో మోదీ-పుతిన్ కలిసి కారులో ప్రయాణించిన సందర్భాలు నాలుగుకు చేరాయి.

### ఇన్నోప్రోమ్ ప్రదర్శనకు కలిసి ప్రయాణం

ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ, పుతిన్ భారత్ మండపం ప్రాంగణంలోని ఇన్నోప్రోమ్ ప్రదర్శనకు కలిసి వెళ్లారు. అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శనగా పేరున్న ఇన్నోప్రోమ్‌లో ప్రపంచవ్యాప్తంగా తయారీ సంస్థలు, కొనుగోలుదారులు, సాంకేతిక రంగ ప్రతినిధులు పాల్గొంటారు. ఆధునిక సాంకేతికతను ప్రదర్శించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం, వ్యాపార సంబంధాలను పెంచడం ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యం. అంతకుముందు జరిగిన భేటీలో మోదీ పుతిన్‌కు తిరువళ్లువర్ రచించిన తిరుక్కురళ్ రష్యన్ అనువాదాన్ని బహుమతిగా అందించారు. భాషలు, సరిహద్దులు దాటే తిరుక్కురళ్ జ్ఞానం ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. ఈ బహుమతి ద్వారా భారత్-రష్యా సంబంధాల్లో ప్రజల మధ్య అనుబంధానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమైంది.

### వాణిజ్యం నుంచి యుద్ధాల వరకు చర్చలు

మోదీ-పుతిన్ చర్చల్లో భారత్-రష్యా ప్రత్యేక, ప్రాధాన్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన విస్తృత అంశాలు చర్చకు వచ్చాయి. వాణిజ్యం, ఇంధనం, రక్షణ, అంతరిక్షం, ప్రజల మధ్య సంబంధాల్లో జరుగుతున్న పురోగతిని ఇద్దరు నేతలు సమీక్షించారు. పశ్చిమాసియా సంక్షోభం, నల్ల సముద్ర ప్రాంతంలోని పరిణామాలు సహా ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. వివాదాలకు చర్చలు, దౌత్యమే పరిష్కార మార్గమని మోదీ స్పష్టం చేశారు. శాంతి ప్రయత్నాలకు భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. భారత్‌కు రష్యా కీలక వ్యూహాత్మక భాగస్వామి, ప్రధాన రక్షణ సరఫరాదారుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ చివరిసారిగా 2025 డిసెంబర్‌లో భారత్ పర్యటించగా, ఈ నెలలో కిర్గిజిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ ఇద్దరు నేతలు సమావేశమయ్యారు. ఇప్పుడు ఢిల్లీలో జరిగిన ఈ నాలుగో 'కార్ డిప్లమసీ' భారత్-రష్యా బంధంలోని సాన్నిహిత్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటింది.

## ఢిల్లీ హోటళ్లు

# ప్రపంచ నేతల కోటలు!

**బ్రిక్స్‌తో మారిన ఢిల్లీ హోటల్ సీన్**
**పుతిన్ నుంచి షీ వరకు హైసెక్యూరిటీ**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో న్యూఢిల్లీలోని లగ్జరీ హోటళ్లు హైసెక్యూరిటీ దౌత్య కేంద్రాలుగా మారిపోయాయి. ఇవాళ, రేపు జరిగే సదస్సు కోసం ఢిల్లీ వ్యాప్తంగా 3,000కు పైగా హోటల్ గదులు బుక్ అయినట్లు సమాచారం. ప్రముఖ హోటళ్లలో సాధారణ అతిథులకు గదులు దొరకని పరిస్థితి నెలకొంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఐటీసీ మౌర్యలో బస చేస్తున్నారు. అక్కడ గది అద్దెలు కొన్ని సందర్భాల్లో రాత్రికి రూ.2 లక్షలు దాటుతున్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తాజ్ ప్యాలెస్‌లో బస చేయనున్నారు. ఈ హోటల్‌లో ప్రస్తుతం గదులన్నీ బుక్ అయినట్లు సమాచారం. ది ఒబెరాయ్ న్యూఢిల్లీలో బ్రెజిల్, కజకిస్థాన్, ఇథియోపియా, ఇండోనేషియా ప్రతినిధి బృందాలు బస చేస్తున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెషెష్కియన్ కూడా అక్కడికి చేరుకోనున్నారు. భద్రతా కారణాలతో హోటళ్లలో బహుళస్థాయి తనిఖీలు అమలు చేస్తున్నారు.

### ఒక్కో హోటల్.. ఒక్కో దేశం

ది తాజ్ మహల్ హోటల్‌లో ఉరుగ్వే, ఫిలిప్పీన్స్, క్యూబా, బెలారస్, వియత్నాం ప్రతినిధి బృందాలు బస చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ డైరెక్టర్ జనరల్స్ కూడా ఇదే హోటల్‌లో ఉన్నారు. లే మెరిడియన్‌లో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధిపతులు బస చేస్తున్నారు. ఉగాండా, నైజీరియా, మలేసియా ప్రతినిధులు కూడా అక్కడే ఉన్నారు. కనాట్ ప్లేస్ సమీపంలోని ది లలిత్ న్యూఢిల్లీలో దక్షిణాఫ్రికా, బురుండి ప్రతినిధి బృందాలకు వసతి కల్పించారు. అశోకా రోడ్డులోని షాంగ్రిలా ఎరోస్‌లో పశ్చిమాసియా ప్రాంతానికి చెందిన బ్రిక్స్ సభ్య దేశ ప్రతినిధి బృందం బస చేస్తోంది. అక్కడ సూట్లు పూర్తిగా బుక్ కాగా, గది ధరలు రూ.60 వేల వరకు చేరాయి. ఇలా ప్రతి హోటల్ ఇప్పుడు ఒక ప్రత్యేక దౌత్య జోన్‌గా మారింది.

### రూ.2 లక్షలు దాటిన గది అద్దెలు

ప్రపంచ నేతలు, మంత్రులు, దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు, వ్యాపార ప్రముఖులు ఒకేసారి ఢిల్లీకి చేరడంతో లగ్జరీ హోటళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో గదుల లభ్యత తగ్గి ధరలు భారీగా పెరిగాయి. బ్రిక్స్‌లో ప్రస్తుతం బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ ఉన్నాయి. వీరితో పాటు బెలారస్, కజకిస్థాన్, మలేసియా, థాయ్‌లాండ్, క్యూబా, నైజీరియా, ఉజ్బెకిస్థాన్, ఉగాండా వంటి భాగస్వామ్య దేశాల ప్రతినిధులు కూడా ఢిల్లీకి చేరుకుంటున్నారు. గుటెరస్ సహా కీలక అంతర్జాతీయ సంస్థల అధిపతులు సదస్సులో పాల్గొంటున్నారు. ఎంబ్రేయర్ సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెస్ నెటో, వేల్ సీఈఓ గుస్తావో పిమెంటా వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో బ్రిక్స్ సదస్సు ప్రభావం కేవలం భారత్ మండపానికే పరిమితం కాకుండా ఢిల్లీ స్టార్ హోటళ్ల నుంచి వ్యాపార రంగం వరకు స్పష్టంగా కనిపిస్తోంది.




# డాలర్ v/s డిజిటల్

- కరెన్సీపై బ్రిక్స్‌లో భారత్ క్లారిటీ
- చెల్లింపులే అసలు లక్ష్యమని వెల్లడి




2026 బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న వేళ డాలర్‌ను పూర్తిగా పక్కన పెట్టే విషయంలో భారత్ స్పష్టమైన వైఖరితో ఉంది. చైనా, రష్యా డీడాలరైజేషన్‌ను వ్యూహాత్మక లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తున్నాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా కూడా దీనిపై బలంగా మాట్లాడుతున్నారు. అయితే భారత్ మాత్రం డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఒకే బ్రిక్స్ కరెన్సీ తీసుకురావాలన్న ఆలోచనకు దూరంగా ఉంటోంది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే స్పష్టం చేసినట్టుగా డాలర్‌ను లక్ష్యంగా చేసుకోవడం భారత ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక విధానంలో భాగం కాదు. దీనికి ప్రధాన కారణం బ్రిక్స్‌లోని దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో ఉన్న భారీ తేడాలు. ఒకే కరెన్సీకి అవసరమైన ఏకీకృత ఆర్థిక విధానం, బడ్జెట్ నియంత్రణ, రాజకీయ సమన్వయం ఈ కూటమిలో ప్రస్తుతం లేవు. అందుకే భారత్ డాలర్ స్థానంలో కొత్త కరెన్సీ కంటే, అవసరమైన చోట స్థానిక కరెన్సీల వినియోగంపై దృష్టి పెడుతోంది.

### సీబీడీసీతో చెల్లింపుల కొత్త మార్గం

భారత్ అసలు ముందుకు తీసుకెళ్తున్న ప్రతిపాదన ఇక్కడే కీలకంగా మారుతోంది. బ్రిక్స్ దేశాల సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలను అనుసంధానం చేసే ప్రతిపాదనను ఆర్‌బీఐ సూచించింది. ఇది బ్రిక్స్ నేతల ముందుకు అధికారికంగా వెళ్లే తొలి ప్రతిపాదనగా మారే అవకాశం ఉంది. 2025 రియో సదస్సులో బ్రిక్స్ చెల్లింపు వ్యవస్థల మధ్య అనుసంధానాన్ని పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పుడు భారత్ దానిని ఆచరణాత్మక దిశగా తీసుకెళ్లాలని చూస్తోంది. దీని లక్ష్యం సరిహద్దు చెల్లింపుల ఖర్చు తగ్గించడం, లావాదేవీల వేగం పెంచడం, వాణిజ్యం, పర్యాటక చెల్లింపులను సులభతరం చేయడం. అయితే సాంకేతిక ప్రమాణాలు, పాలనా విధానం, భద్రతా నిబంధనలు, దేశాల మధ్య వాణిజ్య అసమతుల్యత వంటి సమస్యలు ఉన్నాయి. రష్యాతో రూపాయి చెల్లింపుల విషయంలో భారత్ గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులే దీనికి ఉదాహరణ. రష్యా వద్ద భారీగా రూపాయి నిల్వలు పేరుకుపోయి వాటిని వినియోగించడం కష్టమైంది. అందుకే సెంట్రల్ బ్యాంకుల కరెన్సీ స్వాప్ ఒప్పందాలు వంటి వ్యవస్థలు కూడా అవసరం కానున్నాయి.

### రూ.226 బిలియన్ లోటే అసలు సమస్య

బ్రిక్స్ కరెన్సీ చర్చకు అతిపెద్ద అడ్డంకి సాంకేతికత కాదు.. వాణిజ్య అసమతుల్యత. బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య లోటు 226 బిలియన్ డాలర్లను దాటింది. అంటే భారత్ ఆ కూటమి నుంచి కొనుగోలు చేసేది ఎక్కువ, అమ్మేది తక్కువ. ఇలాంటి పరిస్థితిలో స్థానిక కరెన్సీల్లోనే వాణిజ్యం చేస్తే మరో దేశ కరెన్సీ నిల్వలు పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. కేవలం డాలర్‌ను రూపాయి, యువాన్‌తో మార్చడం వల్ల అసలు సమస్య పరిష్కారం కాదు. అందుకే భారత్ అనుసరిస్తున్నది 'ఒకే ప్రత్యామ్నాయ కరెన్సీ' విధానం కాదు.. పొరలుగా పనిచేసే చెల్లింపు వ్యూహం. డాలర్ సమర్థవంతంగా ఉన్న చోట దానినే ఉపయోగించడం, సాధ్యమైన చోట స్థానిక కరెన్సీ లావాదేవీలు పెంచడం, స్వాప్ లైన్లతో లిక్విడిటీ సమస్యలను ఎదుర్కోవడం, ఎంపిక చేసిన మార్గాల్లో సీబీడీసీ అనుసంధానాన్ని పరీక్షించడం భారత్ వ్యూహంగా కనిపిస్తోంది. అమెరికాతో క్వాడ్, జీ7 సంబంధాలను కొనసాగిస్తూ బ్రిక్స్‌లోనూ తన ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన పరిస్థితి భారత్‌కు ఉంది. అందుకే ఢిల్లీ లక్ష్యం డాలర్‌ను చంపడం కాదు.. చెల్లింపుల వ్యవస్థను చౌకగా, వేగంగా, బలంగా మార్చడం. బ్రిక్స్ కరెన్సీ కల ఇప్పటికి చర్చగానే ఉండొచ్చు. భారత్ మాత్రం దానికి బదులు పనిచేసే డిజిటల్ మార్గాన్ని ఎంచుకుంటోంది.

# జీ7పై పుతిన్ 40 పర్సెంట్ పంచ్!

- బ్రిక్స్ బలం.. జీ7కు పుతిన్ షాక్
- ప్రపంచ ఆర్థిక శక్తిలో కొత్త సమీకరణం



న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జీ7పై నేరుగా విమర్శలు చేశారు. గత ఐదేళ్లలో ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా బ్రిక్స్ దేశాల వాటా ఉందని, అదే సమయంలో జీ7 వాటా కేవలం 29 శాతంగా ఉందని పుతిన్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారీ మార్పులు జరుగుతున్నాయని, ఒకప్పుడు ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన పాత శక్తుల స్థానంలో కొత్త వృద్ధి కేంద్రాలు ఎదుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక శక్తి పశ్చిమ దేశాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాల వైపు క్రమంగా మారుతున్నదనే సందేశాన్ని పుతిన్ ఈ గణాంకాల ద్వారా బలంగా వినిపించారు.

### పాశ్చాత్య దేశాలపై పుతిన్ తీవ్ర ఆరోపణలు

ప్రపంచ ఆర్థిక పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకరమైన రూపం దాల్చుతోందని పుతిన్ పాశ్చాత్య దేశాలపై ఆరోపణలు చేశారు. పైప్‌లైన్ల ధ్వంసం, అంతర్జాతీయ రవాణా మార్గాలను అడ్డుకోవడం, సముద్ర నౌకలను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు, ఆంక్షలు వంటి చర్యలు జరుగుతున్నాయని అన్నారు. రష్యాపై విధించిన ఆంక్షల సంఖ్య 30 వేలకు పైగా ఉందని, ప్రపంచంలోని మిగిలిన దేశాలపై విధించిన ఆంక్షలన్నింటి కంటే ఇది దాదాపు రెండింతలు అని పేర్కొన్నారు. అయినప్పటికీ రష్యా తన వ్యాపార రంగం, శాస్త్ర సాంకేతికత, విద్య, ఇంజినీరింగ్ నైపుణ్యాలు, ప్రజల సామర్థ్యంపై ఆధారపడి ముందుకు సాగుతోందని చెప్పారు. విశ్వసనీయ భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ జాతీయ సార్వభౌమత్వాన్ని మరింత పటిష్టం చేసుకున్నామని పుతిన్ వెల్లడించారు.

### మోదీ లెక్కల్లో బ్రిక్స్ అసలు బలం

పుతిన్ ప్రస్తావించిన ఆర్థిక గణాంకాలకు ప్రధాని నరేంద్ర మోదీ మరింత బలమైన వివరణ ఇచ్చారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరిగితే, బ్రిక్స్ దేశాల సమిష్టి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు పెరిగిందని మోదీ తెలిపారు. అంటే బ్రిక్స్ ఆర్థిక బలం మిగతా ప్రపంచం కంటే దాదాపు రెండింతల వేగంతో పెరిగిందని వివరించారు. ఇదే సమయంలో భారత్-రష్యా ద్వైపాక్షిక చర్చల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్యాలు, ప్రజల మధ్య సంబంధాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లోని ఘర్షణలపై మోదీ చర్చలు, దౌత్యమే పరిష్కార మార్గమని మరోసారి స్పష్టం చేశారు. రష్యాలో జరగనున్న 24వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి పుతిన్ మోదీని ఆహ్వానించగా, ఆయన ఆహ్వానాన్ని అంగీకరించారు. ఇలా బ్రిక్స్ ఆర్థిక బలం, పాశ్చాత్య ఆంక్షలు, ప్రపంచ శాంతి అంశాలపై ఢిల్లీ వేదికగా రష్యా-భారత్ ఒకే సమయంలో కీలక సందేశాన్ని ఇచ్చాయి.

# మోదీ–షీ భేటీ

## సరిహద్దే అసలు పరీక్ష!

- వాణిజ్య లోటుపై దృష్టి
- ఏడేళ్ల తర్వాత ఢిల్లీకి షీ జిన్‌పింగ్

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నేడు న్యూఢిల్లీలో కీలక ద్వైపాక్షిక భేటీ నిర్వహించనున్నారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో జరగనున్న ఈ సమావేశం ఇరు దేశాల సంబంధాల్లో కీలక ఘట్టంగా మారనుంది. షీ జిన్‌పింగ్ గతంలో 2016లో గోవాలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు, తర్వాత మహాబలిపురంలో జరిగిన అనధికారిక భేటీకి భారత్ వచ్చారు. అయితే 2014 తర్వాత ఢిల్లీకి ఆయన రావడం ఇదే తొలిసారి. 2020 తర్వాత ఇరు దేశాల నేతల మధ్య ద్వైపాక్షిక పర్యటనలు కూడా జరగలేదు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాల్లో ఇటీవల కొంత కదలిక కనిపిస్తున్నా, దీనిని ఇప్పుడే పూర్తిస్థాయి 'రీసెట్'గా చెప్పలేమని నిపుణులు భావిస్తున్నారు. గతేడాది మోదీ చైనా పర్యటనతో ఏర్పడిన సానుకూల వాతావరణాన్ని ఈ సమావేశం మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. రాజకీయ, సైనిక స్థాయిలో స్థిరమైన సంభాషణ కొనసాగించడమే ఇరు దేశాల ముందున్న ప్రధాన అవసరంగా కనిపిస్తోంది.

### అరుణాచల్ సహా సరిహద్దే కీలకం

మోదీ-షీ చర్చల్లో సరిహద్దు శాంతి, స్థిరత్వం అత్యంత కీలక అంశంగా ఉండనుంది. తూర్పు లద్దాఖ్‌లో సైనిక ప్రతిష్ఠంభనకు సంబంధించిన సమస్యల పరిష్కారం తర్వాత ఉన్నతస్థాయి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను పర్యవేక్షించడంతో పాటు వివాదానికి న్యాయబద్ధమైన, సహేతుకమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం ప్రత్యేక ప్రతినిధులు పనిచేయాలని ఇంతకుముందే నిర్ణయించారు. అరుణాచల్ ప్రదేశ్ సహా సరిహద్దు అంశాలపై చైనా వైఖరి భారత్‌కు నిరంతర ఆందోళనగా ఉంది. అందుకే సరిహద్దులో శాంతి లేకుండా ద్వైపాక్షిక సంబంధాల్లో దీర్ఘకాలిక పురోగతి సాధ్యం కాదన్న విషయాన్ని మోదీ స్పష్టం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో ఇరు దేశాలు పోటీదారులు కాకుండా అభివృద్ధిలో పరస్పర అవకాశాలుగా చూడాలని చైనా కూడా సంకేతాలు ఇస్తోంది. దీంతో ఈ భేటీ కేవలం దౌత్య మర్యాదల సమావేశంగా కాకుండా సంబంధాలను స్థిరీకరించే ప్రయత్నంగా మారే అవకాశం ఉంది.




### 112 బిలియన్ డాలర్ల లోటు.. భారత్ ప్రశ్న

సరిహద్దుతో పాటు భారత్-చైనా వాణిజ్య అసమతుల్యత కూడా మోదీ ముందుకు తీసుకురానున్న ప్రధాన అంశం. 2026 మార్చితో ముగిసిన ఏడాదిలో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 151.1 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే అదే సమయంలో భారత్ వాణిజ్య లోటు 112.16 బిలియన్ డాలర్లకు పెరిగింది. చైనా నుంచి భారీగా దిగుమతులు చేసుకుంటున్న భారత్‌కు సమానమైన మార్కెట్ అవకాశాలు లభించడం లేదన్న ఆందోళన ఉంది. అందుకే న్యాయమైన మార్కెట్ యాక్సెస్, సరఫరా గొలుసుల స్థిరత్వం, ఎగుమతులకు మరిన్ని అవకాశాలు భారత్ ప్రధానంగా కోరనుంది. మరోవైపు కొంత సానుకూల మార్పు కూడా కనిపిస్తోంది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులు పునరుద్ధరించబడ్డాయి. చైనా వ్యాపారవేత్తలకు భారత్ వీసా ప్రక్రియను సులభతరం చేసింది. ఆరేళ్ల విరామం తర్వాత సరిహద్దు వాణిజ్యం కూడా తిరిగి ప్రారంభమైంది. సిక్కింలోని నాథులా మార్గం సహా కీలక వాణిజ్య మార్గాలు మళ్లీ తెరుచుకున్నాయి. అయినప్పటికీ ఇవన్నీ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. అందుకే మోదీ-షీ భేటీకి అసలు పరీక్ష సరిహద్దు శాంతి, వాణిజ్య సమతుల్యతే. ఈ రెండు అంశాల్లో పురోగతి కనిపిస్తేనే తాత్కాలిక సానుకూలత శాశ్వత సంబంధాల దిశగా మారే అవకాశం ఉంటుంది.




# డూమ్స్‌డే ప్లేన్.. కదిలే క్రెమ్లిన్!

**రహస్య విమానంలో భారత్‌కు పుతిన్!**
**ఆకాశంలోనే అధ్యక్షుడి భద్రతా కోట**
**రెండు విమానాలు.. ఒకటే రహస్యం**

బ్రిక్స్ సదస్సు కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఆయన పర్యటనకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పుతిన్ ప్రయాణించే విమానాల విషయంలో రష్యా అనుసరించే ప్రత్యేక వ్యూహం మరోసారి ఆసక్తిని రేకెత్తించింది. ఆయన కోసం ఒకే తరహాలో ఉన్న రెండు ఇల్యూషిన్ IL 96300PU విమానాలు ఒకేసారి ప్రయాణించాయి. వీటిలో ఏ విమానంలో పుతిన్ ఉన్నారో బయటివారికి తెలియకుండా ఈ వ్యూహాన్ని అమలు చేస్తారు. పుతిన్ సాధారణంగా ప్రయాణించే ఈ ప్రత్యేక విమానాన్ని 'ఫ్లయింగ్ క్రెమ్లిన్', 'డూమ్స్‌డే ప్లేన్' అని పిలుస్తారు. రష్యా అధ్యక్షుడికి అత్యంత కీలకమైన భద్రత కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో దేశ పాలన కొనసాగించేలా ఈ విమానాన్ని ప్రత్యేకంగా రూపొందించారు.

### ఆకాశంలోనే పూర్తి కమాండ్ సెంటర్

1980లలో ఇల్యూషిన్ డిజైన్ బ్యూరో అభివృద్ధి చేసిన IL96 ఆధారంగా ఈ విమానాన్ని అత్యంత ఆధునిక సాంకేతికతతో మార్చారు. సుమారు 11 వేల కిలోమీటర్లు ప్రయాణించగల నాలుగు ఇంజిన్ల విమానంగా ఇది రూపొందింది. రష్యా స్పెషల్ ఫ్లైట్ స్క్వాడ్రన్ దీనిని నిర్వహిస్తుంది. ఇందులో సురక్షితమైన ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రాడార్ జామింగ్ సాంకేతికత, శాటిలైట్ లింకులు, రక్షిత రేడియో, డేటా ఛానళ్లు ఉన్నాయి. అవసరమైతే ప్రపంచంలో ఎక్కడి నుంచైనా సైనిక, నిఘా, ప్రభుత్వ వ్యవస్థలతో సురక్షితంగా సంబంధాలు కొనసాగించే సామర్థ్యం దీనికి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఇది మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేయగలదు. భద్రతతో పాటు విలాసవంతమైన సౌకర్యాలు కూడా ఇందులో ఉన్నాయి. అధ్యక్షుడి కోసం ప్రత్యేక సూట్, బెడ్‌రూమ్‌లు, విలాసవంతమైన బాత్‌రూమ్‌లు, ప్రైవేట్ కిచెన్, డైనింగ్ ప్రాంతం, సమావేశాల కోసం పెద్ద కాన్ఫరెన్స్ రూమ్ ఉన్నాయి. బంగారు అలంకరణలు, విలాసవంతమైన చెక్క పనులు, ఖరీదైన లెదర్ సీట్లు ఈ విమాన ప్రత్యేకతలు. అందుకే పుతిన్ భారత్ పర్యటనలో ఆయన రాకతో పాటు ఆకాశంలో కదిలే ఈ 'క్రెమ్లిన్'పై కూడా ప్రపంచ దృష్టి పడింది.



## వృషభాచలేశ్వరుడిని దర్శించిన ఆర్జేసీ

### ఆలయ అభివృద్ధిపై మహేశ్వరరెడ్డి కీలక ఆదేశాలు

వేంపల్లి: వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలంలోని పాపాగ్ని నదీ తీరాన ఎద్దులకొండపై కొలువైన శ్రీ వృషభాచలేశ్వర స్వామివారిని దేవదాయ ధర్మదాయ శాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బి.మహేశ్వరరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జేసీని సత్కరించారు. దేవస్థాన ప్రాంగణాన్ని పరిశీలించిన మహేశ్వరరెడ్డి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్నదాన ప్రసాదం పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని భక్తులకు మరింత చేరువ చేసేందుకు గండి క్షేత్రం, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ ప్రాంగణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు పూల మొక్కలు, దేవతా వృక్షాలను విస్తృతంగా పెంచాలని మహేశ్వరరెడ్డి సూచించారు.



## వేంపల్లిలో చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలు

వేంపల్లి: విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి-1 వెంకటరామిరెడ్డి అన్నారు. కడప జిల్లా వేంపల్లిలోని తల్లిశెట్టి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 11 టీంలు పోటీలో పాల్గొన్నాయి. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, సైన్స్ మానవ జీవితంలో కీలక భాగమని వెంకటరామిరెడ్డి సూచించారు. గత 30 ఏళ్లుగా జెవివి సైన్స్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచుతోందన్నారు. జెవివి జిల్లా నాయకుడు చెరుకూరు శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు బాటలు వేస్తాయని, భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రైవేట్ విభాగంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ స్థానం సాధించగా, ప్రభుత్వ విభాగంలో తల్లిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లోనూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ప్రతి కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని జెవివి మండల ప్రధాన కార్యదర్శి కేశవులు సూచించారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు



చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. పర్చూరు మండలం పోతుకట్ల గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై 2023 సెప్టెంబర్ 26న అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడు నాదండ్ల వెంకటస్వామి(56)కి ఒంగోలు స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ శుక్రవారం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధిత బాలికకు రూ.10 వేల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. కేసు దర్యాప్తును పోలీసులు వేగంగా పూర్తి చేసి, అవసరమైన ఆధారాలను సకాలంలో కోర్టుకు సమర్పించడంతో నిందితుడికి శిక్ష పడిందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా 'ఆపరేషన్ దండాయన్' ద్వారా కోర్టు ట్రయల్ మానిటరింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించడం కేసు పురోగతిలో కీలకంగా మారిందన్నారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పర్చూరు సీఐ బి. నాగభూషణం, ఎస్ఐ పులి గోపి, కోర్టు సిబ్బంది, స్పెషల్ పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల భద్రత విషయంలో రాజీ లేదని, నేరాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.




## స్వచ్ఛ ఆంధ్రకు ముంబై వేదికపై ప్రశంసలు

ముంబై: పారిశుద్ధ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ మరో ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ముంబై గోరేగావ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ఐ-ఫ్యాట్ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. దేశంలోనే తొలిసారిగా ఏపీ స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్‌ను ప్రారంభించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర, ఆపరేషన్ క్లీన్ స్వీప్, వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్లు, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. 30 దేశాల నుంచి 600కుపైగా కంపెనీలు పాల్గొంటున్న ఈ ఎగ్జిబిషన్‌లో వ్యర్థాల రీసైక్లింగ్, మురుగునీటి నిర్వహణ, సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే సాంకేతికత, కాలుష్య నియంత్రణ పరికరాలను ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రానికి ఉపయోగపడే ఆధునిక సాంకేతికతలను పట్టాభి పరిశీలించారు. స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్యాల దిశగా రాష్ట్రం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు.



### చట్టం ముందు తప్పించుకోలేరు

### సస్పెన్షన్‌తో కథ ముగియదు

### ఊచలు లెక్కపెట్టాల్సిందే!?

దేవుడి సన్నిధిలో ఉద్యోగం అంటే కేవలం జీతం కోసం చేసే పని కాదు.. భక్తుల విశ్వాసానికి కాపలాగా నిలిచే బాధ్యత. హుండీలో పడే ప్రతి రూపాయి వెనుక ఒక భక్తుడి నమ్మకం ఉంటుంది. ఆలయానికి సమర్పించే ప్రతి బంగారు వస్తువు వెనుక ఒక కుటుంబం భక్తి ఉంటుంది. అలాంటి పవిత్రమైన వ్యవస్థలో పనిచేసే ఉద్యోగి చేతిలో ఆలయ ఆర్థిక వ్యవహారాలు, ఆభరణాల కస్టడీ, బ్యాంకు లాకర్ తాళాలు వంటి కీలక బాధ్యతలు ఎలా వచ్చాయి? ఈ ప్రశ్నే ఇప్పుడు అసలు చర్చకు కేంద్రంగా మారింది.

# నిన్న శివప్రసాద్.. రేపు మీరే!?

కడప జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీ అగస్తీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 2026 సెప్టెంబర్ 9న జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు కొన్ని తీవ్రమైన అభియోగాలను ప్రస్తావించాయి. అయితే సస్పెన్షన్ ఉత్తర్వుల్లో కనిపించినవి మొత్తం వ్యవహారం కాదన్న వాదన ఇప్పుడు ముందుకొస్తోంది. విచారణలో చెక్కులు, బ్యాంకు లావాదేవీలు, భక్తుల వాంగ్మూలాలు, ఆభరణాల కస్టడీ, పాలు, పూల సరఫరాలకు సంబంధించిన అంశాలు కూడా పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. అందుకే ఇది ఒక ఉద్యోగి సస్పెన్షన్‌తో ముగిసే సాధారణ శాఖాపరమైన వ్యవహారం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసలు ప్రశ్నలు ఇప్పుడు మొదలయ్యాయి. లాకర్ తాళం ఎవరి వద్ద ఉండాలి? దాన్ని ఎవరు అప్పగించారు? ఎందుకు అప్పగించారు? లాకర్ ఎప్పుడు తెరిచారు? ఎవరి సమక్షంలో తెరవాలి? ఆ సమయంలో నిబంధనలు పాటించారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించినప్పుడే వ్యవహారం అసలు పరిమాణం బయటపడుతుంది.

### లాకర్ తాళం.. ఆభరణాల లెక్క

అధికారిక సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ప్రస్తావించిన అంశాలు చూస్తే వ్యవహారం ఎంత సున్నితమైనదో అర్థమవుతుంది. విచారణ సందర్భంగా 2026 జనవరి 5న అప్పటి ఈవో సి. శంకర బాలాజీ కర్నూలు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. ఆలయానికి సమర్పించిన కొన్ని బంగారు, వెండి వస్తువులను అప్పటి ఈవో కస్టడీకి అప్పగించినట్లు శివప్రసాద్ నిరూపించలేకపోయినట్లు అందులో పేర్కొన్నట్లు ఉత్తర్వులు చెబుతున్నాయి. 2023 మార్చి 5న రసీదు నంబర్ 22కు సంబంధించిన బంగారు గొలుసు, 2022 సెప్టెంబర్ 5న రసీదు నంబర్ 21కు సంబంధించిన వెండి గొలుసు--డాలర్ అంశాలు ఇందులో ప్రస్తావనకు వచ్చాయి. మరో కీలక అంశం ఇండియన్ బ్యాంకు లాకర్ తాళం. శివప్రసాద్ ఆధీనంలో ఉన్న లాకర్ తాళాన్ని రిటైర్డ్ గ్రేడ్-1 ఈవో కె.రామచంద్రాచార్యులుకు అప్పగించారని, ఆయన 2025 డిసెంబర్ 22న అధికారిక అనుమతి లేకుండా లాకర్ తెరిచారని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఆ సమయంలో ఈవో, ఆభరణాల వెరిఫికేషన్ అధికారి, కర్నూలు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ చైర్మన్ వంటి సంబంధిత వ్యక్తులు అక్కడ ఉన్నప్పటికీ వారి సమక్షంలో లాకర్ తెరవలేదన్న అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. లాకర్ తాళం ఈవో వద్ద కాకుండా తన వద్దే ఉంచుకున్నాడన్న అభియోగం కూడా ఉంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఆలయ ఆభరణాలకు సంబంధించిన తాళం కస్టడీపై స్పష్టమైన రికార్డు ఉందా? తాళం అప్పగించే సమయంలో హ్యాండ్‌ఓవర్ పత్రం ఉందా? లాకర్ తెరిచిన సమయంలో బ్యాంకు రిజిస్టర్‌లో ఎవరి సంతకాలు ఉన్నాయి? లోపల ఉన్న వస్తువులకు వెంటనే లెక్క తీసుకున్నారా? ఈ వివరాలన్నీ పరిశీలించకుండా కేవలం సస్పెన్షన్‌తో వ్యవహారం ముగిస్తే అసలు ప్రశ్నలు అలాగే మిగిలిపోతాయి.

### చెక్కులు.. భక్తుల పేర్ల వెనుక ఏముంది?

విచారణలో బయటపడినట్లు చెబుతున్న మరో అంశం చెక్కులు, బ్యాంకు లావాదేవీలు. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల పేర్లతో చెక్కులు రాసినట్లు, మరికొన్ని సందర్భాల్లో భక్తుల పేర్లను ఉపయోగించి నిధులు చెలామణి చేసినట్లు విచారణలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఇవి ఆరోపణల స్థాయిలో ఉన్న అంశాలైతే వాటిని ఆధారాలతో నిర్ధారించాల్సిందే. ఒక చెక్కు ఎవరి పేరుతో ఉంది? ఏ తేదీన జారీ అయింది? ఎవరు సంతకం చేశారు? ఏ ఖాతాలో జమ అయింది? డబ్బును ఎవరు తీసుకున్నారు? ఆలయ ఖాతా నుంచి బయటకు వెళ్లిన మొత్తానికి బిల్లు ఉందా? సేవ లేదా సరఫరా జరిగినట్లు ఆధారం ఉందా? ఈ ప్రశ్నలకు బ్యాంకు స్టేట్‌మెంట్లు, వౌచర్లు, బిల్లులు, రిజిస్టర్లు సమాధానం చెప్పాలి.


శివప్రసాద్

భక్తుల పేర్లను ఉపయోగించి చెక్కులు రాయించుకుని నిధులను మళ్లించారన్న ఆరోపణలు కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చినట్లు చెబుతున్నారు. సంబంధిత వ్యక్తులు అధికారుల ఎదుట తమకు తెలిసిన విషయాలు వెల్లడించినట్లు సమాచారం. మరో తీవ్ర ఆరోపణగా గతంలో ఆలయంలో పనిచేసిన ఒక పూజారి పేరుతో చెక్కులు రాసిన విషయం ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుతం ఆ పూజారి పక్షవాతంతో మంచానికే పరిమితమైన పరిస్థితిలో ఉండగా ఆయన పేరుతో చెక్కులు రాసి నిధులు వినియోగించుకున్నారన్న అంశం నిజమా కాదా అన్నది పత్రాలతో తేలాలి. ఆ పూజారి చెక్కుపై సంతకం చేశారా? డబ్బు అందుకున్నారా? చెక్కు గురించి ఆయనకు తెలుసా? డబ్బు మరెవరైనా తీసుకున్నారా? బ్యాంకు రికార్డులు ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలవు. పాలు, పూల సరఫరాలకు సంబంధించి అక్రమ వసూళ్లు జరిగాయన్న అంశం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ప్రతిరోజూ ఎంత పాలు వచ్చాయి? ఎంత చెల్లించారు? పూలకు ఎంత ఖర్చు చేశారు? ఎవరికి చెల్లించారు? సంవత్సరాల లెక్కలో మొత్తం ఎంత? అన్నది రికార్డులతో సరిపోల్చాలి. చిన్న మొత్తాలుగా కనిపించే లావాదేవీలు దీర్ఘకాలంలో పెద్ద మొత్తాలుగా మారే అవకాశం ఉన్నందున పూర్తి ఆడిట్ అవసరం.

### నైట్ వాచ్‌మెన్ నుంచి ఖజానా వరకు

శివప్రసాద్ నైట్ వాచ్‌మెన్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి జూనియర్ అసిస్టెంట్‌గా ఎదగడం తప్పు కాదు. అర్హత, అనుభవం, శాఖా నిబంధనల ప్రకారం పదోన్నతి పొందడం సహజమే. కానీ పదోన్నతి తర్వాత ఆభరణాలు, లాకర్, చెక్కులు, బ్యాంకు లావాదేవీలు వంటి అత్యంత కీలకమైన బాధ్యతలు ఒకే వ్యక్తి చుట్టూ ఎందుకు కేంద్రీకృతమయ్యాయన్నదే అసలు ప్రశ్న. ఇలాంటి సున్నితమైన వ్యవహారాల్లో బాధ్యతల విభజన, ద్వంద్వ నియంత్రణ, క్రమం తప్పని తనిఖీలు తప్పనిసరిగా ఉండాలి. పైస్థాయి అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? ఆడిట్‌లు సమయానికి జరిగాయా? స్టాక్ వెరిఫికేషన్, బ్యాంకు రీకన్సిలియేషన్, లాకర్ తనిఖీలు సక్రమంగా నిర్వహించారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి.

దేవాదాయశాఖ ఇప్పుడు కేవలం సస్పెన్షన్‌తో ఆగకుండా గత కొన్నేళ్ల బ్యాంకు ఖాతాలు, చెక్కులు, ఆభరణాల రిజిస్టర్, లాకర్ రికార్డులు, నగదు లావాదేవీలను పూర్తిగా పరిశీలించాలి. అవసరమైతే స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలి. బాధ్యతలో నిర్లక్ష్యం వహించిన అధికారుల పాత్రపైనా విచారణ జరగాలి. అదే సమయంలో సస్పెన్షన్ నేర నిర్ధారణ కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆరోపణలు ఆధారాలతో రుజువు కావాలి.. తప్పు చేసినవారు చట్టం ముందు నిలబడాలి.. నిర్దోషులు అనుమానాల నుంచి బయటపడాలి. ఇది ఒక్క ఉద్యోగి వ్యవహారం కాదు.. భక్తుల నమ్మకం, దేవుడి సొమ్ము, ఆలయ పరిపాలన విశ్వసనీయతకు సంబంధించిన విషయం. సస్పెన్షన్‌తో ఫైల్ మూసేయడం కాదు.. లాకర్ నుంచి ఖజానా వరకు ప్రతి ప్రశ్నకు సమాధానం రావాలి.

# నాగార్జున వర్సిటీలో బౌద్ధ కేంద్రం



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 'బౌద్ధ అధ్యయన కేంద్రం' ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ఏపీ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ సూచించారు. నాగార్జున నగర్‌లో జరిగిన వర్సిటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. 1967లో ఆంధ్ర విశ్వవిద్యాలయ పీజీ కేంద్రంగా ప్రారంభమైన సంస్థ 1976లో పూర్తి స్థాయి విశ్వవిద్యాలయంగా ఎదిగిన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. అప్పట్లో 10 విభాగాలు, 600 మంది విద్యార్థులతో ప్రారంభమైన వర్సిటీ.. ప్రస్తుతం 6,000 మంది విద్యార్థులు, 100 మంది పరిశోధకులతో విస్తరించిందన్నారు. క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన మహా బౌద్ధ తత్వవేత్త ఆచార్య నాగార్జున పేరును 2004లో విశ్వవిద్యాలయానికి పెట్టిన నేపథ్యంలో, ఆయనకు తగిన నివాళిగా బౌద్ధ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. 2024లో NAAC A+ గ్రేడ్ సాధించడంతో పాటు QS ఆసియా ర్యాంకింగ్స్-2026, NIRF-2025లో వర్సిటీ సాధించిన గుర్తింపును గవర్నర్ అభినందించారు. పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామికత, సాంకేతిక విద్యతో భవిష్యత్‌లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించిన గవర్నర్‌కు వీసీ ప్రొఫెసర్ కె.గంగాధరరావు సత్కారం చేశారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్‌ఏ2047 లక్ష్యాలకు విశ్వవిద్యాలయం తనవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జ్ఞానాధారిత, సమ్మిళిత సమాజ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని, విద్యార్థుల్లో నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను పెంపొందించాలని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీనాక్షి ఫోన్.. సురేఖ మళ్లీ యాక్టివ్?



తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ఇన్‌ఛార్జ్ నేరుగా మాట్లాడటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. ఫోన్ సంభాషణలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీలో తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. గతంలో తలెత్తిన వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో మళ్లీ ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సుతో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆమె గైర్హాజరుపై పార్టీలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశాల మేరకే మీనాక్షి నటరాజన్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సురేఖతో పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై సమన్వయం, రాజకీయంగా ముందుకు సాగే మార్గాలపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ఆమెను మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలంగా భాగస్వామ్యం చేయాలన్న ప్రయత్నాలు మొదలైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఫోన్ కాల్ వెనుక అధిష్ఠానం వ్యూహమే ఉందన్న ప్రచారం కొనసాగుతోంది. సురేఖతో సయోధ్యకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్న సంకేతాలుగా ఈ పరిణామాన్ని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణకు నో?

తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని మంత్రి వివేక్ వెంకటస్వామి శాసనసభలో స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసేందుకు రూ.8,000 కోట్లతో కళాశాలలను భారీగా అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలతో కళాశాలలు ప్రైవేటుపరం అవుతాయన్న విద్యార్థులు, అధ్యాపకుల అనుమానాలను తొలగిస్తామని, సాంకేతిక విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఫీజు పెంపు ఉండదని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య కొనసాగుతుందని హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణపై బీఆర్ఎస్ నేతలు కావాలనే విషప్రచారం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ నిర్ణయం ఉండదని స్పష్టం చేశారు. విద్యా విధానంలో పారదర్శకత కోసం అవసరమైతే జీవో 97లో మార్పులు, చేర్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, బోధనా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలను మరింత ఆధునికంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రైవేటీకరణపై వస్తున్న అపోహలను నమ్మవద్దని విద్యార్థులకు సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణలో మార్పులు తెవడంతో పాటు క్యాంపస్‌లలో ఉద్యోగ మేళాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.



## వినాయక చవితికి డీజే బంద్.. ఉల్లంఘిస్తే కేసు

చీరాల, సెప్టెంబర్ 11: వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల ఊరేగింపుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసు శాఖ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. చీరాల సబ్‌డివిజన్ పరిధిలో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై పూర్తిగా నిషేధం విధించినట్లు అడిషనల్ ఎస్పీ సుధాకర్ తెలిపారు. చీరాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మోయిన్ ఆధ్వర్యంలో డీజే ఆపరేటర్లు, యజమానులతో జరిగిన సమావేశంలో నిబంధనలను వివరించారు. అధిక శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు, ఆసుపత్రుల్లోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులకు లోబడి సౌండ్ లిమిటర్లున్న స్పీకర్లను మాత్రమే పరిమిత స్థాయిలో వినియోగించాలని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మైక్‌లు, సౌండ్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఊరేగింపుల్లో డీజేలకు బదులుగా మంగళ వాయిద్యాలు, సంప్రదాయ మేళతాళాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే సౌండ్ బాక్సులు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆపరేటర్లు, మండప నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని అడిషనల్ ఎస్పీ హెచ్చరించారు.?




## అనుమతులు లేకుండా మండపాలు వద్దు

చీరాల, సెప్టెంబర్ 11: వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చీరాల రూరల్ సర్కిల్ సీఐ సుధాకర్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. వీధులు, బహిరంగ ప్రదేశాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీగా ఏర్పడి ganesh utsav.net ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పోలీస్, విద్యుత్ శాఖలతో పాటు సంబంధిత విభాగాల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టమ్‌లకు పూర్తిగా అనుమతి లేదని సీఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసే నిర్వాహకులు, వాటిని అద్దెకు ఇచ్చే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వినాయక మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సీఐ సూచించారు. రాత్రివేళ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీకి చెందిన కనీసం ఒకరు నిరంతరం కాపలాగా ఉండాలని ఆదేశించారు. చీరాల రూరల్ సర్కిల్ పరిధిలోని వాడరేవు, రామాపురం, కటారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తీర ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని సీఐ తెలిపారు. పండుగ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కల్వకుర్తి పంపులు వెంటనే ఆన్ చేయాలి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని పంపులను వెంటనే ఆన్ చేసి 24 గంటల పాటు నిరంతరాయంగా సాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ రైతులతో కలిసి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం స్టేజ్-3 పంప్‌హౌస్, గుడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి రిజర్వాయర్లను నింపి సాగునీరు అందించాలని మర్రి జనార్దన్‌రెడ్డి కోరారు. శ్రీశైలం నుంచి తెలంగాణకు 7 టీఎంసీలు కూడా రావడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90% పూర్తయినా మిగిలిన పనులు చేయకుండా నీటిని నింపడం లేదని విమర్శించారు.



తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ వేడి ఇప్పుడు ఎన్నికల సెగగా మారుతోంది. అధికార పక్షం పాలన లెక్కలు చెప్పాల్సిన సమయంలో.. ప్రతిపక్షం అధికారాన్ని తిరిగి చేజిక్కించుకుంటామంటోంది. బీఆర్ఎస్ ప్రతిరోజూ రేవంత్‌రెడ్డినే టార్గెట్ చేస్తోంది. ఆరోపణలు.. విమర్శలు.. కౌంటర్లు.. సభా రగడ.. ప్రతి అంశం చివరకు సీఎం చుట్టూనే తిరుగుతోంది. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. రేవంత్‌ను బలహీనపరచాలనుకున్న బీఆర్ఎస్.. ఆయన్నే తెలంగాణ రాజకీయాల కేంద్ర బిందువుగా మార్చుతోందా? ఈ ప్రశ్న ఇప్పుడు ఆ పార్టీ వ్యూహానికే కొత్త చిక్కుగా మారింది. అసెంబ్లీ పరిణామాలపై ఫ్లాష్ సర్వే నిర్వహించామని రేవంత్ చెప్పడం, బీఆర్ఎస్ తీరుపై ప్రజల్లోనే ఎక్కువ అసంతృప్తి కనిపించిందని ప్రకటించడం ఈ పోరుకు మరో మలుపు. అది స్వతంత్ర సంస్థ సర్వే కాకపోయినా.. సీఎం స్థాయిలో ఆ ప్రస్తావన రావడం వెనుక రాజకీయ సందేశం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు కుటుంబం, బ్రదర్స్ ఆరోపణలు రేవంత్ వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసే ఆయుధంగా మారుతాయా? కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలను బీఆర్ఎస్ సొంత ప్రయోజనానికి మలుచుకోగలదా? లేక రేవంత్ ఆ చీలికలనే ఏకం చేసే రాజకీయ బలంగా మార్చుకుంటారా? ఇంతలో మూడో కోణంగా బీజేపీ గ్రేటర్ గేమ్‌లోకి దూసుకొస్తే ఓట్ల లెక్కలు ఎలా మారతాయి? ఫ్లాష్ సర్వే ఒక క్షణిక స్పందన మాత్రమే.. కానీ దాని వెనుక మొదలైన రాజకీయ వ్యూహాల యుద్ధం మాత్రం ఎన్నికల దాకా సాగొచ్చు. రేవంత్‌కు అధికార బలం.. బీఆర్ఎస్‌కు దూకుడు.. బీజేపీకి విస్తరించే అవకాశం.. ప్రజలకు మాత్రం చివరి తీర్పు. అసలు పోరు ఎవరి మధ్య? ఎవరి వ్యూహం ఎవరికి లాభం? తెలంగాణ రాజకీయాల్లో రాబోయే మలుపులు ఏంటి?

- ఎవరి లెక్కలు వాళ్లవి.. తెలంగాణలో సెగ
- మూడేళ్లకే మారిందా తెలంగాణ రాజకీయ మూడ్
- రేవంత్ బలమేంటి.. బీఆర్ఎస్ వ్యూహమేంటి?
- బీజేపీ ఎటు.. ఓటు లెక్కలు ఎటు!
- అసలేం జరుగుతోంది.. తెలంగాణ తీర్పు ఎటు?



# ఇటు రేవంత్ ఫ్లాష్ అటు కేసీఆర్ చాణక్య సర్వే

**• రేవంత్ చుట్టూనే తెలంగాణ రాజకీయం**

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ వేదికగా మొదలైన మాటల యుద్ధం క్రమంగా ఎన్నికల మూడ్‌కు చేరుతోంది. అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన పనులు, పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడాల్సి ఉండగా.. వచ్చే ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వస్తారన్న అంశం చుట్టూనే రాజకీయ చర్చ ఎక్కువగా సాగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని రేవంత్‌రెడ్డి సీఎల్పీ సమావేశంలో చెప్పడం రాజకీయంగా ఆసక్తి రేపింది. బీఆర్ఎస్ నేతల తీరుపై ప్రజల్లో ఎక్కువ వ్యతిరేకత కనిపించిందని, ప్రభుత్వంపై ఆశించిన స్థాయిలో వ్యతిరేకత లేదని సర్వే తేల్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇది సీఎం స్వయంగా వెల్లడించిన సర్వే తప్ప స్వతంత్ర సంస్థ ప్రకటించిన అధికారిక ప్రజాభిప్రాయ సర్వే కాదు. అయినప్పటికీ దీనిని ప్రస్తావించడం రాజకీయ సంకేతంగా మారింది. బీఆర్ఎస్ మాత్రం అసెంబ్లీ ఘటనలను ప్రభుత్వ వైఫల్యంగా చూపుతోంది. ఈ క్రమంలో కీలక ప్రశ్న ఒకటి తెరపైకి వస్తోంది. రేవంత్‌రెడ్డిని బలహీనపరచాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రతిరోజూ ఆయన్నే టార్గెట్ చేయడం ద్వారా ప్రజల్లో ఆయన్నే రాజకీయ కేంద్రంగా మార్చుతోందా? ప్రత్యర్థిని విమర్శించడం కంటే తమ ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లడమే బీఆర్ఎస్‌కు కీలకం. లేకపోతే రేవంత్‌ను ఓడించాలనే ప్రతి ప్రయత్నం చివరకు రేవంత్ చుట్టూనే రాజకీయ చర్చను తిప్పే అవకాశముంది.

**• బీఆర్ఎస్ దూకుడు.. రేవంత్‌కు లాభమా?**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నిరంతర దాడి ఇప్పుడు వ్యూహాత్మక చర్చగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా విమర్శించడం, ప్రభుత్వ సమస్యలకు ఆయన్నే బాధ్యుడిగా చూపించడం ప్రతిపక్షంగా సహజమే. కానీ ప్రతి అంశాన్ని రేవంత్ చుట్టూ తిప్పడం బీఆర్ఎస్‌కే నష్టంగా మారే అవకాశముంది. రేవంత్‌ను బలహీనపరచాలంటే విమర్శలు మాత్రమే కాకుండా.. బీఆర్ఎస్ తన ప్రత్యామ్నాయ పాలనను ప్రజల ముందు బలంగా నిలబెట్టాలి. గత ప్రభుత్వ పనితీరు, తప్పులపై వివరణతో పాటు మళ్లీ బీఆర్ఎస్‌ను ఎందుకు ఎన్నుకోవాలో స్పష్టమైన కారణాలు చెప్పాలి. ప్రస్తుతం మాత్రం బీఆర్ఎస్ ప్రచారంలో రేవంత్ పేరు ఎక్కువగా వినిపిస్తోందనే అభిప్రాయం ఉంది. దీంతో ప్రభుత్వంపై ఉన్న అసలు ప్రశ్నల నుంచి చర్చను మళ్లించే అవకాశం రేవంత్‌కు లభిస్తోంది. అసెంబ్లీ పరిణామాల్లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తే, రేవంత్ ఆ దాడిని సభను అడ్డుకుంటున్న ప్రతిపక్షంగా మలిచే ప్రయత్నం చేశారు. ఫ్లాష్ సర్వే ప్రస్తావన కూడా ఇదే రాజకీయ వ్యూహంలో భాగమై ఉండొచ్చు. అయితే దానిని ఎన్నికల ఫలితానికి సంకేతంగా చూడటం తొందరపాటు. ప్రజల ఓటు నిర్ణయాన్ని ధరలు, ఉద్యోగాలు, రైతు సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. అందుకే బీఆర్ఎస్ వ్యక్తిగత దాడుల నుంచి ప్రజా సమస్యలపైకి ఫోకస్ మార్చితేనే రేవంత్ ప్రభుత్వానికి అసలు పరీక్ష మొదలవుతుంది. అప్పటివరకు బీఆర్ఎస్ దూకుడు రేవంత్‌ను బలహీనపరుస్తుందా.. లేక ఆయన్నే మరింత బలపరుస్తుందా అన్నదే కీలక ప్రశ్న.

**• బ్రదర్స్ అంశం.. రేవంత్‌కు రాజకీయ ఇబ్బందేనా?**

బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న ఆరోపణల్లో సీఎం కుటుంబం, సన్నిహిత వర్గాలు, బ్రదర్స్ అంశం కూడా రాజకీయంగా చర్చలోకి వస్తోంది. ఒక ముఖ్యమంత్రిపై ఆరోపణలు రావడం కంటే అవే ఆరోపణలు పదేపదే ప్రజా చర్చలో ఉండటం రాజకీయంగా ఎక్కువ ప్రభావం చూపొచ్చు. అయితే ఆరోపణలు చేయడం ఒకటైతే.. వాటిని ఆధారాలతో నిరూపించడం మరో విషయం. ఆరోపణల సంఖ్య కంటే వాటి విశ్వసనీయతే ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తుంది. కుటుంబం, అధికార వ్యవస్థ, ప్రభుత్వ నిర్ణయాలు, ఆర్థిక ప్రయోజనాలను కలిపి బీఆర్ఎస్ ప్రచారం చేస్తే రాజకీయ వేడి పెరగొచ్చు. కానీ "తప్పు ఎక్కడ జరిగింది, ఆధారం ఏమిటి, ప్రజలకు జరిగిన నష్టం ఏమిటి" అన్న స్పష్టత లేకపోతే అవి రాజకీయ శబ్దంగానే మిగిలిపోవచ్చు. మరోవైపు రేవంత్ కూడా ప్రతి ఆరోపణను రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం ప్రమాదమే. అవసరమైన చోట స్పష్టమైన సమాధానాలు, విచారణలు, పారదర్శకత ఆయనకు రక్షణగా నిలుస్తాయి. బీఆర్ఎస్ వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేస్తే రేవంత్ తనను పాలనకు ప్రతీకగా చూపించాలి. అదే సమయంలో కాంగ్రెస్ గత బీఆర్ఎస్ పాలనలోని ధరణి, భూముల వ్యవహారాలను తెరపైకి తీసుకురావడం ద్వారా ఎదురుదాడి చేస్తోంది. అయితే గతాన్ని చూపించి వర్తమాన ప్రశ్నలను తప్పించుకోలేరు. చివరకు ప్రజలు "ఇప్పుడు ఏం జరుగుతోంది?" అన్నదే చూస్తారు. అందుకే బ్రదర్స్ అంశం రేవంత్‌కు సవాలే అయినా, దాన్ని ఆయన తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం కూడా ఉంది.

**• బీజేపీ ఎక్కడ? గ్రేటర్‌లో గేమ్ మారుతుందా?**

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరు కనిపిస్తున్నా.. మూడో శక్తిగా బీజేపీని తక్కువ అంచనా వేయడం రెండు పార్టీలకు ప్రమాదకరం. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది.
రేవంత్ ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం పెరగొచ్చు లేదా తగ్గొచ్చు, బీఆర్ఎస్ పుంజుకోవచ్చు, బీజేపీ దూకుడు పెంచవచ్చు. కాంగ్రెస్ కూడా తన పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లొచ్చు. ఈ పరిణామాల మధ్య బీజేపీకి ప్రత్యేక అవకాశం ఉంది. కాంగ్రెస్‌పై అసంతృప్తి ఉన్న ఓటర్లు తప్పనిసరిగా బీఆర్ఎస్ వైపు వెళ్లాల్సిన అవసరం లేదు. అలాగే బీఆర్ఎస్‌పై అసంతృప్తి ఉన్నవారు కాంగ్రెస్ వైపు వెళ్లాల్సిన అవసరం లేదు. మూడో ప్రత్యామ్నాయం బలపడితే ఓట్ల విభజన పూర్తిగా మారొచ్చు. నగరాల్లో యువత, మధ్యతరగతి, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, స్థానిక అభివృద్ధి అంశాలు బీజేపీకి స్థలం కల్పించవచ్చు. అయితే బీజేపీ తన రాష్ట్ర నాయకత్వాన్ని ఏకం చేసి, కాంగ్రెస్ వ్యతిరేక ఓటును బీఆర్ఎస్‌తో పంచుకోకుండా తనవైపు తిప్పుకోవాల్సి ఉంటుంది. రేవంత్ దృష్టిలోనూ బీజేపీ కీలకమే. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఓట్ల విభజన కాంగ్రెస్‌కు లాభించొచ్చు. బీఆర్ఎస్‌కు మాత్రం కాంగ్రెస్‌తో పాటు బీజేపీ పెరుగుదల కూడా సవాలే. గ్రేటర్‌లో ట్రాఫిక్, డ్రైనేజీ, రోడ్లు, వరదలు, చెత్త నిర్వహణ, మౌలిక వసతులు వంటి సమస్యలే ప్రధాన ఎన్నికల అంశాలుగా మారొచ్చు. అందుకే రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్ ద్వంద్వ పోరు.. బీజేపీ బలపడితే త్రిముఖ పోరుగా మారే అవకాశముంది. అదే జరిగితే గ్రేటర్ ఎన్నికలు తెలంగాణ రాజకీయ గేమ్‌ను మార్చే తొలి పరీక్షగా నిలవొచ్చు.

**• చాణక్య సర్వే.. రేవంత్ ఫ్లాష్ సర్వేకు కౌంటర్**

రేవంత్‌రెడ్డి అసెంబ్లీ పరిణామాలపై నిర్వహించిన ఫ్లాష్ సర్వేను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని చెబుతున్న సమయంలో.. చాణక్య స్ట్రాటజీస్ సర్వే మాత్రం భిన్నమైన రాజకీయ చిత్రాన్ని చూపిస్తోంది. ఈ సర్వే ప్రకారం ప్రస్తుతం ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 40.7 శాతం, కాంగ్రెస్‌కు 37.1 శాతం, బీజేపీకి 14.1 శాతం ఓటు మద్దతు ఉండొచ్చని అంచనా వేసింది. అంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే స్థితిలో ఉందన్న సంకేతం ఇందులో కనిపిస్తోంది. అయితే ఈ గణాంకాలను తుది ఎన్నికల ఫలితంగా చూడలేం. ముఖ్యంగా బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య 3.6 శాతం తేడా మాత్రమే ఉండటంతో స్వల్ప ఓటు మార్పు కూడా రాజకీయ లెక్కలను తారుమారు చేయొచ్చు. మరోవైపు బీజేపీ 14.1 శాతంతో మూడో స్థానంలో ఉండటం కూడా కీలకమే. ఆ ఓటు ఎటువైపు కదులుతుందన్నది ద్విముఖ పోరును త్రిముఖ సమీకరణంగా మార్చగలదు. చాణక్య సర్వేలో యాంటీ ఇన్‌కంబెన్సీ, నిరుద్యోగం, రైతుల సమస్యలు కీలక అంశాలుగా కనిపించగా.. కాంగ్రెస్‌కు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు కొంత మద్దతు తెస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు ఈ సర్వే పద్ధతి, నమూనా ఎంపిక, మార్జిన్ ఆఫ్ ఎర్రర్ వంటి వివరాలు బహిరంగంగా పూర్తిగా అందుబాటులో లేవన్న విమర్శ కూడా ఉంది. అందుకే ఒకవైపు రేవంత్ ఫ్లాష్ సర్వే, మరోవైపు బీఆర్ఎస్‌కు ఆధిక్యం చూపుతున్న చాణక్య సర్వే.. రెండూ కలిపి చూస్తే అసలు సందేశం ఒక్కటే.. తెలంగాణలో ఎన్నికల పోరు ఇంకా ఓపెన్‌గానే ఉంది. రేవంత్ తన పాలనతో ఈ గ్యాప్‌ను పెంచగలరా? బీఆర్ఎస్ ఈ ఆధిక్యాన్ని స్థిరమైన ప్రజాభిప్రాయంగా మార్చగలదా? బీజేపీ ఓటు చీలిక ఎవరికి లాభం చేస్తుంది? అసలు సమాధానం ఎన్నికల ముందు గ్రౌండ్‌లో మారే మూడ్‌లోనే ఉంది.

**• కాంగ్రెస్ విభేదాలు.. రేవంత్ ఆయుధంగా మార్చగలరా?**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు కొత్తకాదు. వ్యక్తిగత ఆశలు, మంత్రుల మధ్య సమన్వయం, సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తు, నియోజకవర్గ ఆధిపత్యం, పదవుల పోటీ వంటి అంశాలు ఎప్పటికప్పుడు పార్టీలో చర్చకు వస్తుంటాయి. ఇవే రేవంత్‌రెడ్డికి బలహీనతగా మారొచ్చు.. అదే సమయంలో వాటిని సమర్థంగా నియంత్రించి పార్టీని ఒకే దిశలో నడిపితే రాజకీయ బలంగా మార్చుకునే అవకాశం ఉంది. సీఎల్పీ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకే స్వరంతో మాట్లాడాలని, అసెంబ్లీ చర్చల్లో చురుకుగా పాల్గొనాలని రేవంత్ సూచించడం ఈ వ్యూహంలో భాగంగానే కనిపిస్తోంది. భట్టి విక్రమార్క కూడా పార్టీ ఒకే మార్గంలో ముందుకు సాగాలని చెప్పడం గమనార్హం. బీఆర్ఎస్ దాడులు కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతల విభేదాలు బయటపడితే ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. అదే నేతలంతా ఐక్యంగా నిలిస్తే బీఆర్ఎస్ వ్యూహం కొంత బలహీనపడుతుంది. అయితే సీనియర్ నేతలకు తమకంటూ రాజకీయ బలం ఉండటంతో అందరినీ పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు. వారి ప్రయోజనాలను ప్రభుత్వ లక్ష్యాలతో అనుసంధానం చేయడం రేవంత్ ముందున్న అసలు సవాలు. కాంగ్రెస్‌లో చిన్న విభేదాన్నీ బీఆర్ఎస్ పెద్ద రాజకీయ అంశంగా మలచగలదు. అందుకే రేవంత్ విభేదాలను దాచడం కంటే వాటిని సమర్థంగా పరిష్కరించాలి. బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ అంతర్గత సమస్యలపైనే ఆధారపడితే, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఏకతాటిపైకి వస్తే ఆ పార్టీకి ప్రధాన ఆయుధం చేజారుతుంది. చివరకు రేవంత్ రాజకీయ నైపుణ్యానికి అసలు పరీక్ష బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడం మాత్రమే కాదు.. తన పార్టీలోని అసంతృప్తిని నియంత్రించడం.

**• ఇక నెక్స్ట్ ఏంటి.. తెలంగాణలో గేమ్ ఎటు?**

రేవంత్‌రెడ్డి సీఎల్పీ సమావేశంలో ప్రస్తావించిన ఫ్లాష్ సర్వే కాంగ్రెస్‌కు ఊరటనిచ్చినా, దాన్ని రాష్ట్ర ప్రజల తుది అభిప్రాయంగా లేదా ఎన్నికల ఫలితానికి ముందస్తు సంకేతంగా చూడటం తొందరపాటు. అసెంబ్లీ పరిణామాలపై వచ్చిన స్పందన కంటే ఎన్నికల సమయంలో ప్రజల నిర్ణయాన్ని ఉద్యోగాలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, సంక్షేమం, హామీల అమలు, ధరలు, హైదరాబాద్ అభివృద్ధి వంటి విస్తృత అంశాలు ప్రభావితం చేస్తాయి. కాబట్టి రేవంత్ బలం కూడా శాశ్వతం కాదు.. ప్రభుత్వ పనితీరుతో అది పెరగొచ్చు, వైఫల్యాలతో యాంటీ ఇన్‌కంబెన్సీ పెరగొచ్చు. ఇదే సమయంలో బీఆర్ఎస్ రేవంత్‌పై చేస్తున్న నిరంతర దాడులు ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతగా మారితే ఆ వ్యూహం ఫలించినట్టే; లేకపోతే వ్యక్తిగత విమర్శలను దాటి "బీఆర్ఎస్ మళ్లీ ఎందుకు?" అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. గత పాలనను గుర్తుచేయడంతో పాటు భవిష్యత్ తెలంగాణకు ప్రత్యామ్నాయ ప్రణాళిక చూపించాలి. రేవంత్ ప్రభుత్వం కూడా కుటుంబం, బ్రదర్స్, భూములు, ధరణి వంటి ఆరోపణలను కేవలం రాజకీయ కుట్రగా కొట్టిపారేయకుండా అవసరమైన చోట ఆధారాలతో, పారదర్శకంగా సమాధానం చెప్పాలి. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను నియంత్రించడం రేవంత్‌కు కీలకం.. అవి బహిర్గతమైతే బీఆర్ఎస్‌కు అవకాశం, ఐక్యత సాధిస్తే రేవంత్‌కు బలం. ఇక బీజేపీ బలపడితే ఓట్ల సమీకరణాలు మారే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు ఎవరు గెలుస్తారన్నది కాదు.. రాబోయే కాలంలో ఎవరు ప్రజల ముందు విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తారన్నదే అసలు ప్రశ్న. ఎన్నికల దిశగా రేవంత్ పాలన, బీఆర్ఎస్ వ్యూహ మార్పు, బీజేపీ దూకుడు, కాంగ్రెస్ అంతర్గత సమన్వయమే తదుపరి రాజకీయ చిత్రాన్ని నిర్ణయించబోతున్నాయి.






# కొడాలి ఖలేజాకు ఛాలెంజ్

## గుడివాడలో పొలిటికల్ రివేంజ్

గుడివాడ రాజకీయాలను ఒక దశలో పార్టీ పేరుతో కాకుండా కొడాలి నాని పేరుతోనే కొలిచే పరిస్థితి వచ్చింది. తెలుగుదేశం కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో ఒక సాధారణ రాజకీయ కార్యకర్తగా మొదలై నాలుగు వరుస విజయాలతో తనకంటూ ఒక రాజకీయ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న నాని.. చివరకు అదే గుడివాడలో 53,040 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇది సాధారణ ఓటమి కాదు. నాలుగు ఎన్నికల్లో వరుసగా గెలిచిన నాయకుడి రాజకీయ ప్రయాణంలో ఒక్కసారిగా పడిన భారీ బ్రేక్. 2024లో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము 1,09,980 ఓట్లు సాధించగా, నాని 56,940 ఓట్లకే పరిమితమయ్యారు. గెలుపు మార్జిన్ 53,040. 2019లో నాని 19,479 ఓట్ల మెజారిటీతో గెలిచిన అదే గుడివాడలో ఐదేళ్లలో రాజకీయ సమీకరణం అంతగా మారిపోయిందంటే.. అది కేవలం అభ్యర్థి ఓటమి కాదు. ఒక రాజకీయ శైలిపై ప్రజల తీర్పుగా కూడా దాన్ని చదవాల్సి ఉంటుంది. కొడాలి నాని అసలు పేరు కొడాలి వెంకటేశ్వరరావు. 1971 అక్టోబర్ 22న గుడివాడలో జన్మించిన ఆయన విద్యాభ్యాసం పదో తరగతి స్థాయిలోనే ఆగిపోయిందని అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం తెలుస్తోంది. రాజకీయాల్లోకి రావడానికి ముందు సాధారణ జీవితం నుంచి వచ్చిన నాని.. కృష్ణా జిల్లా తెలుగు యువత రాజకీయాల్లో చురుకుగా పనిచేశారు. నందమూరి కుటుంబంతో ఏర్పడిన సాన్నిహిత్యం, ముఖ్యంగా నందమూరి హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌లతో ఉన్న అనుబంధం ఆయన రాజకీయ ఎదుగుదలకు కీలకంగా మారింది. 2004లో గుడివాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నాని.. కాంగ్రెస్ అభ్యర్థి కఠారి ఈశ్వర్‌కుమార్‌పై 8,862 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అప్పటికి గుడివాడలో ఆయన ఒక కొత్త ముఖం. కానీ ఆ గెలుపు తర్వాత ఆయన పేరు నియోజకవర్గ రాజకీయాల్లో శాశ్వతంగా నమోదైంది.

• ఫైర్ బ్రాండ్ జగన్ కు బలమా.. భారమా

• 2029 గుడివాడ ఎన్నికల ఛేంజింగ్ చాప్టర్

### • గెలుపుల జోరు.. వైసీపీ వైపు నాని మలుపు

2009లో నాని కథ మరింత బలపడింది. టీడీపీ తరపున మరోసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పిన్నమనేని వెంకటేశ్వరరావుపై 17,630 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంటే 2004లో వచ్చిన 8,862 ఓట్ల ఆధిక్యం కంటే దాదాపు రెట్టింపు. వరుసగా రెండోసారి గెలిచిన నాని ఇక గుడివాడ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం లేని నాయకుడిగా ఎదిగారు. అయితే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు.. శాశ్వత శత్రువులు ఉండరు అనే మాటకు ఆయన రాజకీయ ప్రయాణమే ఉదాహరణ. 2012లో టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరడం ఆయన కెరీర్‌లో అతిపెద్ద మలుపు. టీడీపీలో తనకు, నందమూరి కుటుంబానికి తగిన ప్రాధాన్యం లేదనే అసంతృప్తి ఆయన పార్టీ మార్పు వెనుక ఉన్న కారణాల్లో ఒకటిగా అప్పట్లో ప్రచారం జరిగింది. 2014లో అదే గుడివాడలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీకి చెందిన రావి వెంకటేశ్వరరావుపై 11,537 ఓట్ల మెజారిటీ సాధించారు. పార్టీ మారినా వ్యక్తిగత ఓటు బ్యాంకు తన వెంట వస్తుందనే నమ్మకాన్ని నాని ఆ ఎన్నికతో నిరూపించారు. 2019 ఎన్నికలు నాని రాజకీయ శిఖర దశకు నిదర్శనం. టీడీపీ తరపున దేవినేని అవినాష్ బరిలోకి దిగినా నాని 89,833 ఓట్లు సాధించి 19,479 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదే సమయంలో వైసీపీ అధికారంలోకి రావడంతో నాని కేబినెట్ లో చోటు దక్కించుకున్నారు. 2019 జూన్ 8న పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ప్రమాణం చేశారు. 2022 ఏప్రిల్ 7 వరకు ఆ పదవిలో కొనసాగారు. కాబట్టి నాని రాజకీయ జీవితాన్ని కేవలం గుడివాడ ఎమ్మెల్యేగా చూడటం సరైంది కాదు. 2004 నుంచి 2024 వరకు వరుసగా నాలుగు ఎన్నికల్లో గెలిచిన నాయకుడు.. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు.

### • దూకుడే బలం.. అదే బలహీనతగా మారిందా?

అయితే నాని రాజకీయ ప్రయాణంలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన బలం కూడా అదే.. బలహీనత కూడా అదే. ప్రత్యర్థిపై దూకుడుగా దాడి చేయడం, మాటను వెనక్కి తీసుకోకుండా ముందుకు వెళ్లడం, చంద్రబాబు సహా టీడీపీ అగ్రనేతలపై తీవ్ర విమర్శలు చేయడం ద్వారా ఆయన వైసీపీ శ్రేణుల్లో ఫైర్‌బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకున్నారు. సభలోనైనా, మీడియా ముందైనా, రాజకీయ ప్రత్యర్థులపై అయినా ఆయన మాట తీరు ఎప్పుడూ మృదువుగా ఉండేది కాదు. ఈ దూకుడు ఒక దశలో వైసీపీకి ఆయుధంగా కనిపించింది. కానీ రాజకీయ వాతావరణం మారిన తర్వాత అదే దూకుడు ప్రతికూలతగా మారిందా? 2024 ఎన్నికల ఫలితం ఆ ప్రశ్నను తప్పించుకోనివ్వదు. 2022లో నాని మంత్రి పదవి నుంచి తప్పుకోవడాన్ని వ్యక్తిగతంగా ఆయనను మాత్రమే లక్ష్యంగా చేసుకున్న చర్యగా చూడటం సరికాదు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మొత్తం మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించి కొత్త కేబినెట్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే నాని సహా పాత మంత్రులు తప్పుకున్నారు. అయితే నాని చుట్టూ అప్పటికే ఏర్పడిన వివాదాస్పద రాజకీయ ముద్రను కూడా పూర్తిగా పక్కన పెట్టలేం. చంద్రబాబు కుటుంబంపై అసెంబ్లీలో జరిగిన తీవ్ర వాగ్వాదం, వ్యక్తిగత వ్యాఖ్యల వివాదం, తర్వాత చంద్రబాబు సభ నుంచి బయటకు వెళ్లి తిరిగి ముఖ్యమంత్రిగా వస్తానని శపథం చేయడం.. ఆ ఘట్టం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో బలమైన భావోద్వేగ రాజకీయానికి దారి తీసింది. దాని ప్రభావాన్ని ఎవరు ఎంత వరకు అంచనా వేసినా, ఆ సంఘటన 2024 ఎన్నికల రాజకీయ చర్చలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది.

### • క్యాసినో ఆరోపణల నుంచి 53 వేల ఓట్ల ఓటమి దెబ్బ

ఇదే సమయంలో గుడివాడలో క్యాసినో నిర్వహణపై ఆరోపణలు కూడా నాని రాజకీయ ఇమేజ్‌ను చుట్టుముట్టాయి. కేకన్వెన్షన్‌కు సంబంధించిన క్యాసినో ఆరోపణలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం జరిగింది. అయితే ఇవి ఆరోపణలేనని, నిర్ధారిత న్యాయపరమైన తీర్పులుగా చూపడం మాత్రం సరికాదు. రాజకీయాల్లో ఒక నాయకుడిపై వచ్చే ఆరోపణలు, అతని ప్రత్యర్థులు నిర్మించే కథనం, ప్రజలు ఇచ్చే తీర్పు... ఈ మూడు వేర్వేరు అంశాలు. నాని విషయంలో కూడా ఇదే తేడాను గుర్తించాలి. అసలు పరీక్ష 2024లో వచ్చింది. గుడివాడలో నాలుగుసార్లు గెలిచిన నాని.. ఐదోసారి కూడా గెలుస్తాననే ధీమాతో రంగంలోకి దిగారు. కానీ టీడీపీ తరపున వెనిగండ్ల రాము కొత్త వ్యూహంతో ముందుకొచ్చారు. ఫలితం వెలువడినప్పుడు రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరిచిన సంఖ్య 53,040. రాము 1,09,980 ఓట్లు సాధించగా నానికి 56,940 ఓట్లు వచ్చాయి. అంటే నాని ఓడిపోవడమే కాదు.. ఆయనకు గతంలో ఉన్న రాజకీయ ఆధిపత్యానికి గుడివాడ ఓటరు గట్టి దెబ్బ కొట్టాడు. 2019లో 19,479 ఓట్ల మెజారిటీ సాధించిన నాయకుడు ఐదేళ్ల తర్వాత 53,040 ఓట్ల తేడాతో ఓడిపోవడం రాజకీయ గ్రాఫ్‌లో సాధారణ క్షీణత కాదు. అక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. నాని ఓడింది వ్యక్తిగతంగా మాత్రమేనా? లేక నాని ప్రతినిధ్యం వహించిన రాజకీయ శైలీ ఓడిపోయిందా? సమాధానం అంత సులభం కాదు. 2024లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ తీవ్రంగా నష్టపోయింది. కూటమి ప్రభంజనం అనేక నియోజకవర్గాల్లో వైసీపీని వెనక్కు నెట్టింది. కాబట్టి గుడివాడ ఫలితాన్ని కేవలం నాని వ్యక్తిగత ప్రతికూలతతోనే వివరించడం అతిశయోక్తి. కానీ అదే సమయంలో 53 వేలకుపైగా ఓట్ల తేడాను కూడా సాధారణ రాష్ట్రవ్యాప్త వ్యతిరేకతగా కొట్టిపారేయడం సాధ్యం కాదు. ప్రజలు నాయకుడి పనితీరు, వ్యవహారశైలి, ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయం, స్థానిక సమీకరణాలు, కూటమి ఓట్ల ఏకీకరణ.. అన్నింటినీ కలిపి తీర్పు ఇస్తారు.

### • పదవి పోయింది.. నాని ప్రభావం తగ్గిందా?

ఇప్పుడు నాని ముందున్న అసలు సమస్య ఎన్నికల్లో ఓటమి కాదు. ఓటమి తర్వాత తన రాజకీయ స్థానం ఏమిటన్నదే. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడు ఒక్కసారిగా పదవిలేని రాజకీయ నాయకుడయ్యారు. మంత్రిపదవి లేదు. ఎమ్మెల్యే పదవి లేదు. అధికార యంత్రాంగంపై ప్రత్యక్ష ప్రభావం లేదు. గతంలో రోజూ వార్తల్లో కనిపించిన నాని.. ఇప్పుడు ప్రజా జీవితంలో కనిపించే తీరు కూడా మారింది. ఒకప్పుడు నాని మాట్లాడితే రాజకీయ చర్చ జరిగేది. ఇప్పుడు నాని మాట్లాడుతున్నాడా? అనే ప్రశ్నే చర్చగా మారే పరిస్థితి ఏర్పడింది. దీనికి మరో కోణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు నాని చుట్టూ ఉండే రాజకీయ వ్యవస్థ, అనుచర వర్గం, స్థానిక నెట్‌వర్క్.. అధికార మార్పు తర్వాత అదే స్థాయిలో పనిచేస్తుందా? రాజకీయ నాయకుడి అసలు బలం పదవి కాదు.. పదవి లేకపోయినా తన వెంట నడిచే మనుషుల సంఖ్య. 2024 ఓటమి తర్వాత నాని తన వ్యక్తిగత రాజకీయ నెట్‌వర్క్‌ను ఎంతవరకు నిలబెట్టుకుంటారన్నది భవిష్యత్తు నిర్ణయించే అంశం. ముఖ్యంగా గుడివాడలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా నాని పాత రాజకీయ వ్యవస్థను తిరిగి సమీకరించడం ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి. అదే సమయంలో అనారోగ్యం కూడా నాని వెంటాడుతోంది. ఆయన ముంబైలో బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. గతంలోలా ఆయన ఇప్పుడు అంత యాక్టివ్‌గా కూడా లేరంటున్నారు. ఓవైపు నారా లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం గురించి చెప్పిన మాటలు ఇప్పటికీ మనకు చెవుల్లో మార్మోగుతున్నాయ్. ఈ మొత్తం పరిస్థితుల్లో కొడాలి రాజకీయం ఎలా ఉంటుందన్నదానిపై సస్పెన్స్ అంతకంతకూ పెరుగుతోంది.



### • నాని విషయంలో జగన్‌కు ఇదే చిక్కు!

ఇక్కడే వైసీపీకి మరో చిక్కు. నాని వంటి నాయకుడిని పూర్తిగా పక్కన పెట్టడం పార్టీకి అంత సులభం కాదు. గుడివాడలో ఆయనకు నాలుగు ఎన్నికల అనుభవం ఉంది. కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఆయనకు పరిచయాలు ఉన్నాయి. ఒకప్పుడు టీడీపీ నుంచి వచ్చి వైసీపీకి బలమైన రాజకీయ ముఖంగా నిలిచిన నాయకుడు. అదే సమయంలో ఆయనను ముందువరుసలో నిలబెట్టడం కూడా వైసీపీకి ఇప్పుడు అంత సులభం కాదు. ఎందుకంటే జగన్ పార్టీ 2024 తర్వాత తన రాజకీయ భాషను, తన ప్రచార శైలిని, తన ప్రజా ఇమేజ్‌ను తిరిగి నిర్మించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అలాంటి సమయంలో అత్యంత దూకుడైన, వివాదాస్పద వ్యాఖ్యలతో గుర్తింపు పొందిన నాయకుడిని ముందుకు తేవాలా? లేక కొత్త తరహా ముఖాలకు అవకాశం ఇవ్వాలా? ఇదే అసలు ప్రశ్న. జగన్‌కు నాని అవసరమా? అవసరం లేదని చెప్పలేం. నాని లాంటి మాస్ పొలిటికల్ ఫేస్ అవసరం లేకపోతే 2014 నుంచి 2019 వరకు వైసీపీ అతనిపై ఇంతగా ఆధారపడేది కాదు. అదే సమయంలో 2024 తర్వాత వైసీపీ పునర్నిర్మాణంలో నాని పాత పాత్రను యథాతథంగా కొనసాగించడం కూడా సాధ్యం కాదు. అంటే నాని పూర్తిగా బయటకు కాదు.. పూర్తిగా లోపలకీ కాదు. రాజకీయంగా ఇది అత్యంత ప్రమాదకరమైన మధ్యస్థానం. నాయకుడిని పక్కన పెట్టలేరు.. ముందుకు తెచ్చినా లాభనష్టాలు రెండూ ఉంటాయి.

### • నాని భవితవ్యం.. జగన్ వ్యూహంపై ఆధారం!

గుడివాడలో కొడాలి నాని కథ ముగిసిందా.. లేక మరో మలుపు మొదలైందా? నాలుగు పర్యాయాలు గెలిచిన నాయకుడు, మంత్రిగా పనిచేసిన నేత, వైసీపీకి ఒకప్పుడు ఫైర్‌బ్రాండ్ ముఖంగా నిలిచిన నాని.. 2024లో 53,040 ఓట్ల భారీ తేడాతో ఓడిపోయిన తర్వాత ఇప్పుడు పదవిలేని రాజకీయ కేంద్రంగా మారారు. కానీ ఓటమి నానిని ముగించలేదు.. ఆయన ముందు కొత్త ప్రశ్నను పెట్టింది. మళ్లీ దూకుడుతో వస్తారా.. లేక వ్యూహంతో వస్తారా? గుడివాడలో వెనిగండ్ల రాము తన బలాన్ని పెంచుకుంటుంటే.. వైసీపీ కొత్త నాయకత్వం కోసం చూస్తోంది. ఈ రెండు పరిణామాల మధ్య నాని స్థానం ఎక్కడ? జగన్ ఆయనను పాత బలంతో ముందుకు నడిపిస్తారా.. లేక కొత్త ముఖాలకు మార్గం వేస్తారా? నాని వైసీపీకి బలం కావచ్చు.. అదే సమయంలో పాత వివాదాల కారణంగా భారంగా కూడా మారొచ్చు. అందుకే ఇది కేవలం నాని భవిష్యత్తు ప్రశ్న కాదు.. వైసీపీ వ్యూహానికి కూడా పరీక్ష. 2029 దిశగా అడుగులు పడుతున్న వేళ గుడివాడలో పాత రాజకీయ సమీకరణాలు కదులుతున్నాయి. నాని కోట గుమ్మం దగ్గరే నిలుస్తారా.. మళ్లీ లోపలికి అడుగుపెడతారా.. లేక కొత్త నాయకత్వానికి దారి ఇచ్చి వెనుక వరుసలో నిలబడతారా? 2024 ఓటమి బ్రేక్ కావచ్చు.. కానీ చివరి పేజీ మాత్రం కాదు.

### • 2029 బరిలో నాని ఉండరా.. వారసుడెవరు?

నాని 2029పై స్వయంగా చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2024 మార్చిలో ఇచ్చిన ఇంటర్వ్యూలో వచ్చే ఎన్నికలే తనకు చివరివని, 2029లో తాను పోటీ చేయనని చెప్పారు. తన ఇద్దరు కుమార్తెలకు రాజకీయాలపై ఆసక్తి లేదని, తన తమ్ముడి కుమారుడికి ఆసక్తి ఉంటే భవిష్యత్తులో రాజకీయాల్లోకి రావచ్చని చెప్పారు. అంతేకాదు, 58 ఏళ్ల వయసులో ఎన్నికల్లో పోటీ చేయకూడదనే ఉద్దేశాన్ని కూడా వెల్లడించారు. అంటే నాని రాజకీయ వారసత్వంపై చర్చ 2024 ఫలితాల తర్వాత మొదలైనది కాదు. నాని స్వయంగా ఆ చర్చకు తలుపు తెరిచారు. అయితే ఇక్కడ ఒక రాజకీయ లెక్కను గుర్తించాలి. ఒక నాయకుడు తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పడం వేరు. పార్టీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ నాయకుడిని తయారు చేయడం వేరు. 2029 చాలా దూరం కాదు. గుడివాడలో నాని తర్వాత ఎవరు? అనే ప్రశ్న వైసీపీకి ఇప్పటి నుంచే ఉంటుంది. కొత్త నాయకుడిని తయారు చేయాలంటే కనీసం రెండు మూడు సంవత్సరాల సమయం అవసరం. గ్రామస్థాయి నెట్‌వర్క్, మండల స్థాయి సమన్వయం, సామాజిక సమీకరణాలు, కార్యకర్తల నమ్మకం, ఎన్నికల నిర్వహణ... ఇవన్నీ ఒక్కసారిగా తయారవ్వవు. అందుకే నాని రాజకీయ భవిష్యత్తుపై సందిగ్ధత ఉన్నా.. గుడివాడలో ప్రత్యామ్నాయ నాయకత్వ నిర్మాణం వైసీపీకి తప్పనిసరి.

### • నాని వారసుడెవరు.. గుడివాడలో కొత్త లెక్కలు?

మండలి హనుమంతరావు వంటి నాయకుల పేర్లు ఈ నేపథ్యంలో వినిపించడం కూడా అదే రాజకీయ అవసరానికి సంకేతంగా చూడవచ్చు. అయితే 2029 వైసీపీ అభ్యర్థి ఎవరో ఇప్పుడే ఖరారైందని చెప్పడానికి బలమైన అధికారిక ఆధారం లేదు. అలాగే నాని తమ్ముడి కుమారుడే భవిష్యత్ వారసుడని కూడా ఇప్పుడే తేల్చేయడం తొందరపాటు. నాని స్వయంగా చెప్పిన వ్యాఖ్య మాత్రం ఒక విషయం స్పష్టం చేస్తుంది... తన కుటుంబంలో రాజకీయ వారసత్వానికి తలుపు పూర్తిగా మూసేయలేదు. మరి నాని రాజకీయంగా ముగిసిపోయారా? లేదు. కానీ నాని పాత రూపంలో తిరిగి వస్తారా? అదే పెద్ద ప్రశ్న. రాజకీయాల్లో ఓటమి అంతిమ తీర్పు కాదు. కానీ భారీ ఓటమి తర్వాత కూడా పాత పద్ధతిలోనే కొనసాగితే అది ప్రమాదకరం. 53,040 ఓట్ల తేడా ఒక నాయకుడికి ప్రజలు ఇచ్చిన గట్టి హెచ్చరిక. ఆ హెచ్చరికలోని సందేశాన్ని అర్థం చేసుకోకుండా కేవలం ప్రత్యర్థులను నిందిస్తే పునరాగమనం అసాధ్యం. ప్రజల మనస్తత్వం మారింది. సోషల్ మీడియా రాజకీయాలు మారాయి. కూటమి రాజకీయాలు కొత్త సమీకరణాలను తెచ్చాయి. ఓటరు కూడా ఒక నాయకుడి దూకుడు కంటే తనకు అందే పాలన, స్థానిక సమస్యలు, అభివృద్ధి, అందుబాటు వంటి అంశాలను ఎక్కువగా కొలుస్తున్నాడు.

### • నానికి రెండు దారులు.. పునరాగమనమా, పక్కకా..!?

అందుకే నాని ముందున్న దారులు రెండు మాత్రమే. ఒకటి.. పాత ఫైర్‌బ్రాండ్ ఇమేజ్‌తో మళ్లీ రాజకీయ రంగంలోకి దూకడం. రెండోది.. పదవిలేని నాయకుడిగా కొంతకాలం నిశ్శబ్దంగా ఉండి, వివాదాలకు దూరంగా ప్రజల మధ్య తన వ్యక్తిగత సంబంధాలను పునర్నిర్మించుకోవడం. మొదటి మార్గం అభిమానులను ఉత్సాహపరచవచ్చు. రెండో మార్గం రాజకీయ పునరాగమనానికి ఎక్కువ ఉపయోగపడవచ్చు. ఎందుకంటే ఓడిపోయిన నాయకుడు మళ్లీ గెలవాలంటే ముందుగా ప్రత్యర్థిని ఓడించాల్సిన అవసరం లేదు. తనపై ఏర్పడిన అభిప్రాయాన్ని ఓడించాలి. వైసీపీకి కూడా ఇదే పరీక్ష. నానిని ముందుకు నెట్టడం ద్వారా పార్టీకి మాస్ ఎనర్జీ వస్తుందా? లేక పాత వివాదాలు తిరిగి తెరపైకి వస్తాయా? నానిని పూర్తిగా పక్కన పెడితే కృష్ణా జిల్లాలో పార్టీకి ఉన్న అనుభవజ్ఞుడైన ఒక రాజకీయ యోధుడిని కోల్పోతుందా? ఈ రెండింటి మధ్య జగన్ వ్యూహం ఉండే అవకాశం ఉంది. అందుకే నాని రాజకీయ భవిష్యత్తును 'లోపల ఉన్నారా? బయట ఉన్నారా?' అనే రెండు రంగుల్లో చూడటం కంటే 'ఏ పాత్రలో ఉన్నారు?' అనేదే ముఖ్యమైన ప్రశ్న. గుడివాడలో నాని అధ్యాయం ముగిసిందని ఇప్పుడే తీర్పు చెప్పడం కూడా తొందరపాటు. కానీ నాని పాత గుడివాడను తిరిగి తెచ్చుకోవడం మాత్రం అంత సులభం కాదు. 2004లో 8,862 ఓట్ల మెజారిటీతో మొదలైన ప్రయాణం 2009లో 17,630కి, 2014లో 11,537కి, 2019లో 19,479కి వెళ్లింది. అదే ప్రయాణం 2024లో 53,040 ఓట్ల ఓటమితో ఆగిపోయింది. ఈ సంఖ్యలే నాని రాజకీయ జీవితానికి పూర్తి కథ చెబుతున్నాయి. ఎదుగుదల కూడా సంఖ్యల్లోనే ఉంది. పతనం కూడా సంఖ్యల్లోనే ఉంది.

# టార్గెట్ 372

## డీఎస్సీపై జగన్ చాణక్య వ్యూహం




- స్పోర్ట్స్ కోటాపైనే సందేహం
- లోకేశ్ మంత్రి పదవి పైనే గురి
- వాస్తవాల కోసం సీబీఐ విచారణ తప్పనిసరి
- ప్రైవేట్ మెడికల్ కాలేజీల తరహాలో మాస్ వార్నింగ్
- అధికారంలోకి వస్తే అడ్డదారిలో వచ్చిన వారిపై ఛేజింగ్
- కాక్రోచ్‌ల ఉద్యమమే ఇన్స్పిరేషన్
- రోజుకో ఆధారంతో జగన్ సెన్సేషన్

**టార్గెట్ 372.. ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఇదే బర్నింగ్ పాయింట్. డీఎస్సీ–2025 నియామకాల్లో వేలాది మంది అభ్యర్థులు పరీక్ష రాసి మెరిట్ కోసం పోటీ పడితే.. 372 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీపై మాత్రం ఇంత పెద్ద సందేహాలు ఎందుకు తలెత్తుతున్నాయి? ఇదే ప్రశ్నను పదేపదే సంధిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వ్యవహారాన్ని రాజకీయంగా పీక్‌కు తీసుకెళ్తున్నారు. మొత్తం డీఎస్సీని తప్పుబట్టకుండా.. కేవలం 372 పోస్టులనే టార్గెట్ చేయడం వెనుక చాణక్య వ్యూహం ఉందనే చర్చ మొదలైంది. సర్టిఫికెట్లు నిజమేనా? పోటీలు నిజంగానే జరిగాయా? పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల ఆధారంగా ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు ఎలా దక్కాయి? ఎవరు ధృవీకరించారు? ఎక్కడ నిబంధనలు మారాయి? ఒక్కో ప్రశ్నను తెరపైకి తెస్తూ జగన్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నారు. గతంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల విషయంలో ఇచ్చిన హెచ్చరికల తరహాలోనే.. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేది లేదన్న సంకేతం ఇస్తున్నారు. "అధికారంలోకి వస్తే ఛేజింగ్ తప్పదు" అన్న రాజకీయ సందేశం మరింత ఆసక్తి రేపుతోంది. కాక్రోచ్‌ల ఉద్యమం తరహాలో పట్టువదలకుండా వెంటాడే వ్యూహమే జగన్ అనుసరిస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రోజుకో ఆధారం, రోజుకో ప్రశ్నతో 372 నియామకాలను డీఎస్సీ వివాదానికి కేంద్రబిందువుగా మార్చుతున్నారు. అసలు 372లో దాగిన నిజం ఏంటి? ఆధారాలు ఎంత బలంగా ఉన్నాయి? ఆరోపణలకు అధికారిక విచారణ ఎప్పుడు? ఇప్పుడు ఇదే అసలు సస్పెన్స్.**

### బర్నింగ్ పాయింట్‌గా స్పోర్ట్స్ కోటా నియామకాలు

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 నియామకాలపై రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. మొత్తం డీఎస్సీ నియామక ప్రక్రియను తప్పుబట్టడం లేదని చెబుతున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా ద్వారా 372 టీచర్ పోస్టుల భర్తీ అంశాన్నే బర్నింగ్ పాయింట్‌గా ముందుకు తీసుకొస్తున్నారు. ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు పరీక్షలు రాసి, మెరిట్ ఆధారంగా పోటీ పడుతున్న సమయంలో.. కొంత మందికి పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటా పేరుతో ఉద్యోగాలు ఇచ్చారన్నది జగన్ ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలకు సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని ఆయన పదేపదే చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని స్పోర్ట్స్ సర్టిఫికెట్లు నిజమైనవేనా? కొన్ని పోటీలు అసలు జరిగాయా? కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల ఆధారంగా ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు ఎలా వచ్చాయి? అనే ప్రశ్నలను జగన్ లేవనెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో 372 మంది నియామకాలు ఇప్పుడు సాధారణ రాజకీయ ఆరోపణల స్థాయిని దాటి పెద్ద వివాదంగా మారుతున్నాయి. న్యాయబద్ధంగా, నిబంధనల ప్రకారం ఉద్యోగం పొందినవారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, అక్రమ మార్గాల్లో ఉద్యోగం పొందినట్లు విచారణలో తేలితే మాత్రం చర్యలు తప్పవన్న సంకేతాన్ని వైసీపీ వర్గాలు ఇస్తున్నాయి. ఇదే అంశం ఇప్పుడు ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. జగన్ అధికారంలో లేనప్పటికీ ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టకుండా పదేపదే ప్రస్తావించడం వెనుక పెద్ద వ్యూహం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. "టార్గెట్ చేశాడంటే ఇక వదిలే ప్రసక్తే ఉండదు" అనే రాజకీయ ప్రచారం కూడా దీనికి బలం చేకూరుస్తోంది. గతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలో జగన్ ఇచ్చిన హెచ్చరికలను గుర్తు చేస్తున్న వైసీపీ నేతలు.. అప్పట్లో కాంట్రాక్టర్లు, ప్రైవేట్ సంస్థలు ముందుకు వస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిర్ణయాలను తిరగరాస్తామని జగన్ స్పష్టం చేశారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే తరహాలో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల విషయంలోనూ జగన్ కఠిన వైఖరి తీసుకున్నారని చెబుతున్నారు.

### నాటి మెడికల్ కాలేజీల హెచ్చరిక

జగన్ రాజకీయ శైలిని గమనించినవారు ముందుగా ప్రస్తావిస్తున్న ఉదాహరణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వివాదం. ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే విధానాన్ని జగన్ అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. పబ్లిక్ హెల్త్ వ్యవస్థలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన వాదించారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన చరిత్రను ప్రస్తావిస్తూ.. వాటిని ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనివ్వబోమని హెచ్చరించారు. ప్రైవేటీకరణ ప్రక్రియలో పాల్గొనే సంస్థలు, కాంట్రాక్టర్లు జాగ్రత్తగా ఉండాలని.. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే పరిస్థితులు మారుతాయని స్పష్టమైన రాజకీయ సందేశం ఇచ్చారు. ఆ హెచ్చరిక తర్వాత ప్రైవేట్ వర్గాలు వెనక్కి తగ్గాయని వైసీపీ వర్గాలు ప్రచారం చేశాయి. ఇప్పుడు అదే ఫార్ములాను డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వివాదానికి అన్వయిస్తున్నారు. అప్పట్లో "ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు చేతుల్లోకి వెళితే తిరిగి ప్రభుత్వంలోకి తీసుకొస్తాం" అనే రాజకీయ హెచ్చరిక ఉంటే.. ఇప్పుడు "అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు తేలితే వదిలిపెట్టం" అనే హెచ్చరిక వినిపిస్తోందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అయితే ఈ రెండింటి మధ్య చట్టపరమైన పరిస్థితులు ఒకేలా ఉండవు. మెడికల్ కాలేజీల విధాన నిర్ణయం ఒక అంశం కాగా.. ఉద్యోగ నియామకాల్లో అక్రమాల ఆరోపణలు పూర్తిగా విచారణ, ఆధారాలు, న్యాయ ప్రక్రియపై ఆధారపడే విషయం. అయినా రాజకీయంగా జగన్ సందేశం మాత్రం స్పష్టంగా ఉందని ఆయన అనుచరులు అంటున్నారు. "ప్రభుత్వ ఉద్యోగం అంటే అమ్ముకునే వస్తువు కాదు.. మెరిట్‌తో సాధించాల్సిన హక్కు" అనే వాదనను ముందుకు తెస్తున్నారు. డీఎస్సీ ద్వారా సుమారు 15 వేల మందికి ఉద్యోగాలు వచ్చిన మొత్తం నియామకాన్ని ప్రశ్నించడం జగన్ ఉద్దేశం కాదని.. కేవలం 372 స్పోర్ట్స్ కోటా నియామకాలపై అనుమానాలు ఉన్నందునే ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారని చెబుతున్నారు. అందుకే ఈ వ్యవహారం డీఎస్సీ మొత్తానికి మచ్చగా కాకుండా.. నిర్దిష్టంగా 372 పోస్టుల చుట్టూ తిరుగుతున్న వివాదంగా చూడాలని వైసీపీ వర్గాలు కోరుతున్నాయి.

### 372 పోస్టులపై అసలు అభియోగం

372 స్పోర్ట్స్ కోటా పోస్టులే అసలు బర్నింగ్ పాయింట్ అని జగన్ తన తాజా వ్యాఖ్యల్లో స్పష్టం చేశారు. సాధారణ డీఎస్సీ పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటా నిబంధనల కింద టీచర్ పోస్టులు పొందే అవకాశం ఎలా కల్పించారనేది ఆయన ప్రధాన ప్రశ్న. స్పోర్ట్స్ కోటా కింద అభ్యర్థుల అర్హతను నిర్ధారించే సర్టిఫికెట్ల ప్రామాణికతపై కూడా జగన్ అనేక ప్రశ్నలు లేవనెత్తారు. కొన్ని సందర్భాల్లో అసలు జరగని టోర్నమెంట్లలో పాల్గొన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చారన్నది ఆయన ఆరోపణ. తెలంగాణలో జరగలేదని సంబంధిత క్రీడా సంఘాలు చెప్పిన పోటీలకు సంబంధించిన సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చారని జగన్ ఉదాహరణలు ప్రస్తావించారు. ఖమ్మంలో జరిగినట్లు పేర్కొన్న జూడో పోటీ విషయంలో కూడా ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. నల్గొండలో జరిగినట్లు పేర్కొన్న ఖోఖో పోటీపై కూడా తెలంగాణ ఖోఖో సంఘం నుంచి అభ్యంతరాలు వచ్చినట్లు జగన్ పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కూడా స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందిన ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ ప్రస్తుతం జగన్ చేసిన ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంటుంది. అయితే ఆరోపణల స్వరూపం తీవ్రమైనదిగా ఉండటంతోనే సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నామని వైసీపీ చెబుతోంది. కొన్ని స్పోర్ట్స్ సంఘాల పదవుల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నారని జగన్ ప్రశ్నించారు. సర్టిఫికెట్లను ఎవరు ధృవీకరించారు? ఆ సర్టిఫికెట్ల ఆధారంగా అర్హతను ఎవరు నిర్ణయించారు? పోటీ నిజంగా జరిగిందని ఎవరు నిర్ధారించారు? అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు. పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సరిపోతుందా? దాని వెనుక పోటీ జరిగినట్టు ఆధారం ఉందా? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. జగన్ ఆరోపణల ప్రకారం కొన్ని సందర్భాల్లో పతకాలు గెలిచిన అవసరం లేకుండా కేవలం పోటీలో పాల్గొన్నట్టు చూపించి ఉద్యోగాలు పొందిన పరిస్థితి కనిపిస్తోందని ఆయన అంటున్నారు. నిజంగా అలాంటి అక్రమాలు జరిగితే అది సాధారణ పరిపాలనా తప్పిదం కాదని.. ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి చదివిన నిరుద్యోగ యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే వ్యవహారమని వైసీపీ వర్గాలు వాదిస్తున్నాయి.

### జీవో 4, 47పై జగన్ ప్రశ్నలు

డీఎస్సీ వివాదంలో జగన్ మరో కీలకంగా ప్రస్తావిస్తున్న అంశం జీవో నంబర్ 4, జీవో నంబర్ 47. పరీక్ష నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలను ఒకే వ్యక్తి చుట్టూ ఎందుకు కేంద్రీకరించారని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయ్యాక జీవోలు మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని నిలదీశారు. జగన్ ఆరోపణల ప్రకారం మొదట తీసుకొచ్చిన జీవోలు కొన్ని మార్గాలను తెరిచినట్లుగా కనిపిస్తే.. తర్వాత జీవో నంబర్లు 23, 25, 56 ద్వారా వాటిని మూసివేసే ప్రయత్నం జరిగిందని ఆయన అంటున్నారు. ఈ మార్పుల వెనుక ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో డీఎస్సీ పేపర్ లీక్ అంశాన్ని కూడా ఆయన కలిపి ప్రస్తావిస్తున్నారు. ప్రశ్నపత్రం తయారీ ప్రక్రియలో ఒకే వ్యక్తికి ఎక్కువ అధికారాలు ఇవ్వడం వల్ల వ్యవస్థలో బలహీనతలు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. పేపర్‌కు సంబంధించిన సమాచారం పొందిన వ్యక్తి పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్ సాధించాడన్న ఆరోపణలు వచ్చాయని.. తరువాత అతని పేరు మెరిట్ జాబితా నుంచి తొలగించారని జగన్ పేర్కొన్నారు. ఉద్యోగాలు అమ్మకానికి ఉన్నాయన్న భావన కలిగించే ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నాయని కూడా ఆయన చెబుతున్నారు. అయితే వీటి చట్టబద్ధత, విశ్వసనీయత, పూర్తి నేపథ్యం అధికారిక దర్యాప్తులోనే నిర్ధారణ కావాల్సి ఉంటుంది. డీఎస్సీపై ఆరోపణలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని జగన్ చెబుతుండటం రాజకీయంగా కీలకంగా మారింది. ఆయన ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేసి విచారణకు అవకాశం కల్పించాలని వైసీపీ నేతలు కోరుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే విజిలెన్స్ విచారణతో పూర్తి నిజాలు బయటకు రావని.. స్వతంత్ర కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిగితేనే అసలు వ్యవహారం తేలుతుందని వైసీపీ వాదిస్తోంది. సీబీఐ విచారణకు ప్రభుత్వం అంగీకరిస్తే ఆరోపణల వెనుక ఉన్న నిజాలు బయటపడతాయని జగన్ తేల్చి చెబుతున్నారు. ఇక్కడే జగన్ వార్నింగ్ మరింత రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

### సర్కారుకు పెద్దలకు, అక్రమార్కులకు స్వీట్ వార్నింగ్

372 పోస్టుల వివాదం ఇప్పుడు కేవలం జగన్-ప్రభుత్వం మధ్య రాజకీయ పోరాటంగా చూడాల్సిన అంశం కాదు. ఒక యువకుడు ప్రభుత్వ ఉద్యోగం కోసం సంవత్సరాల పాటు చదివి, పరీక్ష రాసి, మెరిట్ కోసం పోరాడుతున్నప్పుడు.. మరోవైపు నిబంధనలలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుని ఎవరైనా పరీక్ష లేకుండానే ఉద్యోగం పొందితే ఆ వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? ఇదే అసలు ప్రశ్న. అయితే ఆరోపణలు చేయడం ఒక దశ మాత్రమే.. వాటిని ఆధారాలతో నిరూపించడం మరో దశ. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు నిజమైనవేనా? పేర్కొన్న పోటీలు జరిగాయా? అర్హతలను ఎవరు పరిశీలించారు? నియామక ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించారా? అన్నదానికి సమాధానాలు అధికారిక దర్యాప్తులోనే తేలాలి. నిజమైన క్రీడాకారులు ఉంటే వారికి న్యాయం జరగాలి. అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారు ఉంటే వారిపైనా చట్టం తన పని చేయాలి. అదే సమయంలో నిర్దోషులపై రాజకీయ ముద్ర పడకుండా జాగ్రత్త కూడా అంతే ముఖ్యం. జగన్ చేస్తున్న ఆరోపణలు నిజమైతే ప్రభుత్వం ప్రజల ముందు సమాధానం చెప్పాల్సిందే. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే వాటిని ఆధారాలతో ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఎందుకంటే ఇది 372 మంది ఉద్యోగుల భవిష్యత్తు మాత్రమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగం అంటే మెరిట్‌కు దక్కే గౌరవమా? లేక ప్రభావానికి తెరుచుకునే తలుపా? అనే ప్రశ్న. చివరకు రాజకీయ ప్రచారం కాదు.. నిజం మాత్రమే 372కు తుది తీర్పు చెప్పాలి.




### అర్హులకేం భయం లేదు

**ఈ మొత్తం వివాదంలో కీలకంగా గమనించాల్సిన విషయం.. నిబంధనల ప్రకారం ఉద్యోగం పొందిన వారిని లక్ష్యంగా చేసుకోవడం లేదనే వైసీపీ వాదన. పరీక్షలు రాసి, మెరిట్ సాధించి, చట్టబద్ధంగా నియామకం పొందిన సుమారు 15 వేల మంది టీచర్ల ఉద్యోగాలపై తమకు అభ్యంతరం లేదని జగన్ వైపు నుంచి వస్తున్న రాజకీయ సందేశం ఇదే. స్పోర్ట్స్ కోటా ద్వారా నియామకమైన 372 మందిలో కూడా నిజమైన అర్హత కలిగిన వారు ఉంటే వారికి ఎలాంటి భయం అవసరం లేదనే భావనను వైసీపీ వ్యక్తం చేస్తోంది. కానీ తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి ఉంటే? అసలు జరగని పోటీల్లో పాల్గొన్నట్లు చూపించి ఉంటే? పలుకుబడి ఉపయోగించి అర్హత లేకుండా ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే? డబ్బులు చెల్లించి ఉద్యోగం సంపాదించినట్లు రుజువైతే? అలాంటి సందర్భాల్లో మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవని జగన్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఉద్యోగం మాత్రమే కాదు.. ఉద్యోగం ద్వారా పొందిన ప్రయోజనాలపైనా చర్యలు ఉండొచ్చనే సంకేతం రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. ఆరోపణలు నిజమని దర్యాప్తులో తేలితే సర్వీస్ నిబంధనల ప్రకారం నియామకం రద్దు, వేతనాల రికవరీ, క్రిమినల్ కేసులు వంటి చర్యలు చట్టపరమైన ప్రక్రియలో భాగంగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే ఇవన్నీ విచారణ ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఎవరి ఉద్యోగం చట్టవిరుద్ధమని తుది నిర్ణయం వెలువడలేదు. అందుకే "అక్రమార్కులకు వార్నింగ్.. అర్హులకు భరోసా" అనే రెండు కోణాల్లో ఈ వివాదాన్ని చూడాల్సి ఉంటుంది. వైసీపీ వర్గాల ప్రచారం ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఆరు నెలల్లో వ్యవహారాన్ని నిగ్గు తేల్చే దిశగా చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఉంది. సీబీఐ వంటి స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించి బాధ్యులను గుర్తిస్తామని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. తప్పు చేసిన అధికారుల నుంచి మొదలుకొని నకిలీ పత్రాలు సమర్పించిన అభ్యర్థులు, వారికి సహకరించిన వ్యక్తుల వరకు బాధ్యత నిర్ధారించాలని జగన్ వర్గాలు అంటున్నాయి. ఇది కేవలం 372 మంది ఉద్యోగుల విషయం కాదని.. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై నమ్మకం నిలబెట్టే పరీక్ష అని వైసీపీ వాదిస్తోంది.**

# కోట్లా నెట్స్‌లో బుమ్రా బుల్లెట్ షో



## వైభవ్‌కు ఐదు బంతుల్లోనే పేస్ పాఠం

ఢిల్లీ కోట్లా మైదానంలో టీమిండియా ప్రాక్టీస్‌కు జస్ప్రీత్ బుమ్రా అడుగుపెట్టగానే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంతి చేతిలోకి తీసుకున్న బుమ్రా.. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నెట్స్‌లోనే అంతర్జాతీయ స్థాయి పేస్ రుచి చూపించాడు. తొలి బంతి గుడ్ లెంగ్త్‌లో పడగా వైభవ్ బ్యాట్ ఊపినా బంతిని అందుకోలేకపోయాడు. రెండో బంతి అదే లెంగ్త్‌లో వచ్చి అతడిని పూర్తిగా ఇబ్బందిపెట్టింది. మూడో బంతికి బుమ్రా తన ట్రేడ్‌మార్క్ యార్కర్ సంధించగా వైభవ్ ఎలాగోలా బ్యాట్ అడ్డుపెట్టి కాపాడుకున్నాడు. నాలుగో బంతిని కాస్త షార్ట్‌గా వేయడంతో వైభవ్ బ్యాట్ అంచును మాత్రమే తాకగలిగాడు. ఐదు బంతుల్లో ఒకటి మాత్రం ఓవర్‌పిచ్ కావడంతో వైభవ్ కవర్స్ మీదుగా బౌండరీ బాదాడు. అయితే ఆ ఒక్క షాట్ మినహా యువ సంచలనం ఎక్కువసేపు పేస్ బౌలర్ల ముందు నిలవలేకపోయాడు. యశ్ ఠాకూర్, అర్షదీప్ సింగ్ కూడా అతడిని పరీక్షించారు. మరోవైపు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బుమ్రా వేసిన బంతులు వేగంతో రెండు వైపులా ఎడ్జ్‌లను తాకేలా చేశాయి. పేస్, కంట్రోల్, స్వాగ్‌తో బుమ్రా నెట్స్‌లోనే షో స్టాపర్‌గా నిలిచాడు.

# 76 పరుగుల వద్ద బాబర్ బ్లండర్



## నాలుగేళ్ల నిరీక్షణకు షార్ట్‌బాల్‌తో బ్రేక్

ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌కు మరోసారి సెంచరీ చేజారింది. నాలుగేళ్లుగా టెస్టు శతకం కోసం ఎదురుచూస్తున్న బాబర్.. మూడో రోజు 76 పరుగుల వద్ద విచిత్రమైన షాట్‌తో వికెట్ పారేసుకున్నాడు. 103 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో దూకుడుగా సాగిన అతడి ఇన్నింగ్స్.. జోష్ టంగ్ వేసిన షార్ట్‌బాల్‌తో ఒక్కసారిగా ముగిసింది. బంతి శరీరం వైపు రావడంతో బాబర్ ఆడిన ఫ్లాప్ షాట్ బ్యాట్ అంచును తాకి నేరుగా వికెట్ కీపర్ జోర్డాన్ కాక్స్ చేతుల్లోకి వెళ్లింది. సిరీస్‌లో ఇంగ్లండ్ బౌలర్లు బాబర్‌పై షార్ట్‌బాల్ వ్యూహాన్ని పదేపదే ప్రయోగిస్తుండగా.. అదే ఉచ్చులో అతడు మరోసారి చిక్కుకున్నాడు. రెండో టెస్టులోనూ ఇలాంటి షాట్‌తోనే వికెట్ కోల్పోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జోష్ టంగ్‌కు బాబర్ నాలుగు ఇన్నింగ్స్‌ల్లో మూడోసారి వికెట్‌గా మారాడు. చివరిసారిగా 2022 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌పై 161 పరుగులు చేసిన బాబర్‌కు.. అప్పటి నుంచి టెస్టు శతకం అందని ద్రాక్షగానే మిగిలింది. అయితే ఈ ఇన్నింగ్స్‌తో కెప్టెన్‌గా 2,000 టెస్టు పరుగుల మైలురాయిని అందుకున్నాడు.

# పాకిస్తాన్‌పై గెలుపుతో ఫైనల్లోకి

- ఆసియా కప్‌లో శ్రీలంక సంచలనం
- టైటిల్ కోసం భారత్‌తో పోరు



దుబాయ్ వేదికగా జరిగిన మహిళల ఆసియా కప్ 2026రెండో సెమీఫైనల్‌లో శ్రీలంక అదరగొట్టింది. పాకిస్థాన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్‌కు ఫాతిమా సనా అద్భుత పోరాటం అందించింది. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో క్రీజులో నిలిచిన ఫాతిమా సనా అజేయంగా 47 పరుగులు చేసి పాకిస్థాన్‌ను 130/5 గౌరవప్రదమైన స్కోరుకు చేర్చింది. అనంతరం బంతితోనూ సత్తా చాటుతూ 38 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టి శ్రీలంకను ఒత్తిడిలోకి నెట్టింది. అయితే శ్రీలంక బ్యాటర్లు లక్ష్య ఛేదనలో అదరగొట్టారు. పాకిస్థాన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. ఫాతిమా సనా ఆల్‌రౌండ్ ప్రదర్శనకు మిగతా జట్టు నుంచి తగిన సహకారం లభించకపోవడంతో పాకిస్థాన్ పోరాటం చివరికి వృథా అయింది. లక్ష్యాన్ని ఛేదించిన శ్రీలంక విజయంతో సంబరాల్లో మునిగిపోయింది. ఈ విజయంతో మహిళల ఆసియా కప్ ఫైనల్‌లో భారత్‌తో తలపడే అవకాశాన్ని శ్రీలంక దక్కించుకుంది. దీంతో టైటిల్ పోరుపై ఆసక్తి మరింత పెరిగింది. భారత్ ఇప్పటికే ఫైనల్ చేరడంతో ఇప్పుడు శ్రీలంకకు గట్టి సవాల్ ఎదురుకానుంది.

# బాబర్ కెప్టెన్సీపై షోయబ్ అఖ్తర్ ఫైర్

## ఇంగ్లండ్‌లో పాక్ వైఫల్యంపై పచ్చి కామెంట్స్



ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ టెస్ట్ జట్టు వరుస పరాజయాలతో కుదేలవుతున్న వేళ.. మాజీ పేసర్ షోయబ్ అఖ్తర్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. మూడు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే 0-2తో వెనుకబడిన పాకిస్థాన్.. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో, రెండో టెస్టులో 194పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. బర్మింగ్‌హామ్‌లో జరుగుతున్న మూడో టెస్టుకు ముందు జట్టు ప్రదర్శనపై విశ్లేషించిన రావల్పిండి ఎక్స్‌ప్రెస్.. బాబర్ నాయకత్వ నిర్ణయాలపై నేరుగా ప్రశ్నలు సంధించాడు. కెప్టెన్‌గా కీలక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం జట్టు సమస్యలకు ప్రధాన కారణమని అభిప్రాయపడ్డాడు. బాబర్ వ్యక్తిత్వం అతడి కెప్టెన్సీ, నిర్ణయాలు, ఆటతీరులోనూ కనిపిస్తోందని.. అందుకే ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని షోయబ్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్ పర్యటనలో ప్రస్తుత పాకిస్థాన్ జట్టుపై తాను పెద్దగా అంచనాలు పెట్టుకోలేదని స్పష్టం చేశాడు. జట్టుపై ఇంతకంటే ఎక్కువ ఆశలు పెట్టుకోవడం కష్టమని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఈ వ్యవస్థపై పెట్టిన పెట్టుబడి, ఆటగాళ్లపై ఉంచిన నమ్మకం విఫలమయ్యాయని షోయబ్ చేసిన వ్యాఖ్యలు పాకిస్థాన్ క్రికెట్‌లో కొత్త చర్చకు తెరలేపాయి.

# లండన్‌లో షిండేతో కోహ్లీ భేటీ

## క్రికెట్ భవిష్యత్ వరకు సాగిన మాటామంతీ



లండన్‌లో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను మర్యాదపూర్వకంగా కలిశాడు. క్రీడలు, మౌలిక వసతులు, యువతకు అవకాశాలు, మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇద్దరి మధ్య ఆసక్తికర చర్చ సాగింది. కోహ్లీని ఎంతో సాదాసీదా వ్యక్తిగా అభివర్ణించిన షిండే.. యువత ప్రతిభను వెలికి తీసి పోటీల్లో రాణించేలా చేయాల్సిన అవసరంపై ఇద్దరం ఆలోచనలు పంచుకున్నామని తెలిపారు. . రాష్ట్ర అభివృద్ధిపై కోహ్లీ సానుకూలంగా స్పందించాడని షిండే వెల్లడించారు. మరోవైపు బ్యాట్‌తో విరాట్ దూకుడు కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది వన్డేల్లో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 384 పరుగులు చేసిన కోహ్లీ.. 64 సగటుతో ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ కెరీర్‌లో 85 సెంచరీలతో ఉన్న విరాట్.. 100 శతకాల మైలురాయిపై కన్నేశాడు. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డేలు అతడి వేటకు మరో వేదిక కానున్నాయి.



# ఎపిక్.. ప్రేమకు ఫస్ట్ సెమిస్టర్! బేబీ జోడీ మళ్లీ మెరిసిందా?

వనపర్తి నుంచి లండన్ వరకు సాగే ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’ కథలో ప్రేమ, స్నేహం, ఈగో, ఎమోషన్ అన్నీ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తాయి. సినిమాపై ‘బేబీ’ జోడీ ఆనంద్ దేవరకొండ వైష్ణవి చైతన్య కాంబినేషన్ సహజంగానే ఆసక్తిని పెంచింది. దర్శకుడు ఆదిత్య హాసన్ అమాయకుడైన ఆదిత్య పాత్రను తెరపైకి తీసుకొచ్చారు. సినిమాపై ఆసక్తి ఉన్నా తల్లిదండ్రుల కోరికతో లండన్ వెళ్లే ఆదిత్యకు అక్కడ విశాఖకు చెందిన స్వతంత్ర భావాలున్న కాదలి పరిచయమవుతుంది. భిన్నమైన స్వభావాలున్న ఈ ఇద్దరి మధ్య మొదలైన పరిచయం క్రమంగా బంధంగా మారుతుంది. అక్కడి నుంచి సరదా సంభాషణలు, చిన్నపాటి గొడవలు, ఈగో క్లాషులు, ప్రేమ, బాధ, సర్దుబాట్లు కథను ముందుకు నడిపిస్తాయి. ఆదిత్యగా ఆనంద్ అమాయకత్వంతో ఆకట్టుకోగా, కాదలిగా వైష్ణవి తన పాత్రకు అవసరమైన బలాన్ని అందించింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, కొన్ని సహజమైన సన్నివేశాలు సినిమాకు ప్లస్‌గా నిలుస్తాయి. హెషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం, నేపథ్య సంగీతం కొన్ని సన్నివేశాలను మరింత ఎలివేట్ చేశాయి. అయితే కథనం పదేపదే అదే భావోద్వేగ వలయంలో తిరగడం, బలమైన క్యారెక్టర్ డెవలప్‌మెంట్ లేకపోవడం, సెకండాఫ్ సాగతీత ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో భావోద్వేగం కనిపించినా అప్పటికే కొంత ఆలస్యం అయిపోతుంది. మొత్తంగా మంచి కాంబినేషన్‌కు సరిపడా బలమైన రైటింగ్ తోడైతే ‘ఎపిక్’ మరింత ఆకట్టుకునేదనే భావన కలుగుతుంది.





# మహేంద్రగిరి వారాహి

## 33 ఏళ్ల మృత్యు రహస్యం! శాపం వెనుక అసలు నిజమేంటి?

మహేంద్రగిరి వంశాన్ని తరతరాలుగా వెంటాడుతున్న 33 ఏళ్ల శాపం చుట్టూ అల్లుకున్న మిస్టరీ థ్రిల్లర్ ‘మహేంద్రగిరి వారాహి’ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. వంశంలోని ప్రతి పురుషుడు 33 ఏళ్ల వయసులోనే అనూహ్యంగా మరణిస్తుండటంతో అసలు కారణాన్ని ఛేదించేందుకు హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్ సిద్ధార్థ్ రంగంలోకి దిగుతాడు. మోసాలు, అక్రమాలను బయటపెట్టే సిద్ధార్థ్.. మహేంద్రగిరి మరణాల వెనుక దాగిన రహస్యాన్ని వేటాడటం మొదలుపెట్టినప్పటి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. ఆరంభ సన్నివేశాలు, ఇంటర్వెల్ ట్విస్ట్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచగా, సిద్ధు జొన్నలగడ్డ కీలక అతిథి పాత్రలో తన మార్క్ చూపిస్తాడు. సుమంత్ తన పాత్రకు నిజాయితీగా న్యాయం చేశాడు. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే మలుపులు ఊహకు అందకుండా ఉండటం సినిమాకు ప్రధాన బలం. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, వంశీ చాగంటి తమ పాత్రల పరిధిలో ఆకట్టుకున్నారు. అయితే మధ్యభాగం నెమ్మదించడం, కొన్ని సన్నివేశాలు కథకు భారంగా మారడం మైనస్. శాపం వెనుక దైవ ప్రమేయాన్ని చివర్లో మాత్రమే చూపించడం లాజిక్ పరంగా ప్రశ్నలు రేకెత్తిస్తుంది. ముఖ్యంగా వీజువల్ ఎఫెక్ట్స్, ఏఐ వినియోగం ఆశించిన స్థాయిలో లేకపోవడం మిస్టరీ వాతావరణాన్ని కొంత దెబ్బతీస్తాయి. ‘మురారి’ తరహా మూలాంశం గుర్తొచ్చినా దర్శకుడు ఎంచుకున్న కథనం భిన్నంగా సాగుతుంది. మొత్తంగా మహేంద్రగిరి వరాహి ఆరంభం, ఇంటర్వెల్, క్లైమాక్స్‌లో మెప్పించే మిస్టరీ థ్రిల్లర్.. కానీ లాజిక్, టెక్నికల్ ఫినిషింగ్ మరింత పదునుగా ఉంటే ప్రభావం ఇంకాస్త బలంగా ఉండేది.



# హనుమాన్ అంశ్..

## తెలుగులోకి ఆధ్యాత్మిక తుఫాన్!

### త్రివిక్రమ్ సమర్పణలో సెప్టెంబర్ 18న విడుదల

బాలీవుడ్‌లో అంచనాలను మించి దూసుకెళ్తున్న ఆధ్యాత్మిక చిత్రం ‘హనుమాన్ అంశ్’ ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నీమ్ కరోలి బాబా జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కిన ఈ సినిమా హిందీలో విడుదలైన తర్వాత వారం వారం వసూళ్లను పెంచుకుంటూ ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఇప్పటివరకు భారత్‌లో రూ.153 కోట్ల నెట్ వసూళ్లు సాధించి భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ చిత్రంపై తెలుగులోనూ ఆసక్తి పెరుగుతోంది. సెప్టెంబర్ 18న తెలుగు వెర్షన్ థియేటర్లలో అడుగుపెట్టనుండగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ఈ డబ్బింగ్ వెర్షన్‌ను సమర్పించడం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. త్రివిక్రమ్ సతీమణి సాయి సౌజన్య ఆధ్వర్యంలోని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు రాష్ట్రాల పంపిణీ బాధ్యతలు చేపడుతోంది. ఆధ్యాత్మికత, భక్తి, మానవీయ అనుభూతులను కలగలిపిన కథగా తెరకెక్కిన ఈ చిత్రంలో శోభినవ్ సత్యా, చందన్ ఆనంద్ ప్రధాన పాత్రల్లో నటించారు. నిఖిల్ దూబే, ఉదయ్‌సింగ్ రాజ్‌పుత్, పూర్ణిమ తివారీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్వంభు మీడియా నెట్‌వర్క్ నిర్మించింది. ఇప్పటికే హిందీలో సంచలన విజయాన్ని అందుకున్న ‘హనుమాన్ అంశ్’ తెలుగు విడుదలతో ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాలి.




# సూరి రెమ్యునరేషన్.. ఏకంగా రూ.20 కోట్లు!

## మండాడి హిట్‌తో మారిన హీరో మార్కెట్

తమిళ చిత్రసీమలో తనదైన నటనతో దూసుకెళ్తున్న నటుడు సూరికి ఇప్పుడు భారీ ఆఫర్ దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ‘మండాడి’ విజయంతో మంచి జోష్‌లో ఉన్న సూరి.. ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న తన తదుపరి చిత్రానికి ఏకంగా రూ.20 కోట్ల పారితోషికం అందుకుంటున్నట్లు సమాచారం. సాధారణ కమెడియన్ నుంచి కథానాయకుడిగా తన మార్కెట్‌ను క్రమంగా పెంచుకుంటూ వచ్చిన సూరికి ఈ రెమ్యునరేషన్ ఆయన కెరీర్‌లోనే కీలక మైలురాయిగా మారింది. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ సినిమా 2015లో చెన్నైని అతలాకుతలం చేసిన వరదల నేపథ్యంతో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రకృతి విపత్తు, దాని వెనుక మానవీయ కోణాలు, ఆ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న విషాద పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా కథ సిద్ధమైనట్లు సమాచారం. సినిమాకు నిర్మాణ వ్యయం కూడా భారీగానే ఉండనుంది. ప్రొడక్షన్ ఖర్చు మాత్రమే రూ.50 కోట్లకు పైగా ఉంటుందని సినీ వర్గాల అంచనా. ‘మండాడి’తో సూరికి వచ్చిన క్రేజ్, పెరిగిన మార్కెట్ ఈ భారీ డీల్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కథకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ తన ఇమేజ్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్తున్న సూరి.. ఈసారి తెలుగు నిర్మాతల భారీ బడ్జెట్‌లో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా రూ.20 కోట్ల రెమ్యునరేషన్ టాక్ కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# 418.. ఆ గదిలో అడుగుపెడితే అంతేనా!




## దెయ్యాల కంటే భయంకరమైనది ఊహేనా?

పది హేనేళ్లుగా మూతపడిన ఓ భవనం.. మళ్లీ తెరుచుకున్న తర్వాత మొదలైన వింత పరిణామాలు.. అందులోని 418వ గది చుట్టూ అలుముకున్న అతీంద్రియ శక్తి.. ఈ మూడు అంశాలతో ‘418 ది మూవీ’ ట్రైలర్ హారర్ ప్రియుల్లో ఆసక్తిని రేపుతోంది. ప్రశాంత్ నీల్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కీర్తన్ నాగగౌడ దర్శకత్వం వహించారు. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, చైత్ర జే ఆచార్, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్ కథను పూర్తిగా విప్పకుండా భయాన్ని మాత్రం ఒక్కో ఫ్రేమ్‌లో పెంచుతూ సాగింది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.